
# బోస్కో మార్గం

కుటుంబ మాస పత్రిక VOL : 19 ISSUE : 10 OCTOBER 2019 అక్టోబర్ వెల : 15/-



# బోస్కో మార్గం

కుటుంబ మాస పత్రిక

సంచిక : 10 సంపుటి 19 2019




## లోపలి పేజీల్లో ...


| | |
|---|---|
| 03 | ప్రభువు సువార్తను ప్రకటించుదాం! |
| 05 | విశిష్ఠ వేదవ్యాపక పరిచర్య మాసము... |
| 07 | మన కావలి దూతలు |
| 09 | జపమాల ధ్యానం - పరలోక ముక్తికి సాధనం |
| 11 | పునీత అస్సీసిపుర ఫ్రాన్సిస్‌గారి పండుగ |
| 13 | దోమినిక్ సావియో యవ్వన జీవితం |
| 15 | మనం మరచిపోతున్న మన జాతిపిత! |
| 17 | క్రీస్తు స్థాపించిన సంఘము |
| 19 | యువతరం శిరమెత్తితే ... నవతరం ... |
| 22 | రక్షకుడు |
| 25 | సహాయమాత సాక్ష్యాలు |
| 26 | బైబిల్ క్విజ్, రాజకీయ వార్తలు |



ప్రచురణ కర్త, సంపాదకులు :
ఫా. సెబాస్టియన్ జాన్, యస్.డి.బి.

మేనేజింగ్ ఎడిటర్:
ఫా. యర్రమనేని బాలి ఎస్.డి.బి.
సెల్ : 9492415255

సర్క్యులేషన్ మేనేజర్స్ :
యస్. జ్యోత్స్న
సెల్ : 8330960969
యన్. వి. సుబ్బారావు
సెల్ : 9703372267



ఎడిటోరియల్ బోర్డ్ :
ఫా. పసల భాస్కర్ ఎస్.డి.బి.
బ్రదర్ చిన్నాబత్తుని గ్రెగోరి ఎస్.డి.బి.
శ్రీమతి బి. ఇన్నాశమ్మ
కె. రాజారెడ్డి




ప్రచురణాలయం:
డాన్‌బోస్కో టెక్నికల్ స్కూల్ ప్రెస్
రింగ్‌రోడ్ - గుంటూరు - 522 007
bmargam2014@gmail.com
donboscopublishinghouse@gmail.com

పత్రిక కావలసినవారు
ఎడిటర్, ప్రచురణాలయం పేరిట
M.O.చేసి పొందవచ్చును.

| | |
|---|---|
| సంవత్సర చందా | : 110 రూ. |
| రెండు సం॥లకు చందా | : 160 రూ. |
| జీవిత చందా | : 1000 రూ. |
| విడి పత్రిక | : 15 రూ. |

# ప్రభువు సువార్తను ప్రకటించుదాం!



ఒక యవ్వనస్తుడు గొడుగుల తయారీ కంపెనీలో పనిచేస్తున్నాడు. అది ఆ ప్రదేశంలో చాలా పెద్ద కంపెనీ. ఒకరోజు అతడు చాలా నిరాశతో తన విచారణ గురువు వద్దకు వచ్చి, "ఫాదర్, నేను ఇంకో ఉద్యోగం వెతుకుతూ వున్నాను. నాకు మంచి ఉద్యోగం దొరకాలని ప్రార్థించండి" అని అడిగాడు.

అతని పని నైపుణ్యతను తెలిసిన ఫాదరుగారు, ఆశ్చర్యమునకు గురయ్యారు. "ఎందుకు యిపుడు వున్న ఉద్యోగమును వదులుకున్నావు?" నీవు పనిచేస్తున్న కంపెనీ యజమానితో ఏమన్నా గొడవలు పడ్డావా? లేక వాళ్ళే నీపని నైపుణ్యం బాగాలేదని తీసివేశారా?" అని ప్రశ్నల వర్షం కురిపించారు. అందుకు అతను అలాంటిదేమీ లేదని యింకాస్త బాధను, నిరాశను జోడించి నిట్టూర్పు విడిచాడు.

మరి యింకెందుకు ఉద్యోగం వదిలేశావు? లేదా మీ కంపెనీకి ఆర్డర్స్ లేక మూసివేయబోతున్నారా? అని యింకో ప్రశ్న వేశారు ఫాదరుగారు. "అది కూడ కాదు ఫాదర్, నిజం చెప్పాలంటే మా కంపెనీకి యింతకు ముందు కంటే ఎక్కువ ఆర్డర్స్ వస్తున్నాయి" అని చెప్పాడు. మరి యింకేమిటి సమస్య, అని ఫాదర్ కాస్తంత నిస్సహాయతతో అడిగారు. అందుకు అతను, "ఫాదర్ మా కంపెనీకొచ్చే ఆర్డర్స్ తయారీకోసం చాలా యంత్రాలు వున్నాయి కాని అందుకు సరిపడా విద్యుత్ లేక రోజంతా ఖాళీగా కూర్చోవడంవల్ల, ఉత్పత్తి తగ్గి, మా ఉద్యోగాలు కోల్పోవలసి వచ్చింది" అని బాధగా చెప్పాడు ఆ యవ్వనస్థుడు.

అవునుగదా! ప్రియ క్రైస్తవ పాఠకులారా! జ్ఞానస్నానం పొందిన ప్రతిబిడ్డకు ప్రభు ఏసుక్రీస్తు ఒక కర్తవ్యాన్ని ఇచ్చివున్నారు. మార్కు 16:15లో "మీరు ప్రపంచమంతట తిరిగి సకల జాతి జనులకు సువార్తను బోధింపుడు" అని. మరి సువార్త సందేశాన్ని ప్రకటించడానికి అవసరమైన అన్ని వనరులను యంత్రాలను నీవు, నేను మనమంతా కలిగివున్నాం. కాని దురదృష్టవశాత్తు "దేవుని శక్తి" అనే విద్యుత్ మనలో సరిపడ పెంచుకోకపోవడంవల్ల సువార్త సేవ చేయలేకపోతున్నామా? క్రైస్తవ జీవితంలో ఎక్కువ యంత్రాలు కలిగివుండి, 'విశ్వాస శక్తి' తక్కువగా వుంది కదా! యంత్రాల పెరుగుదలను నిలిపి, ప్రభు సువార్త అనే విద్యుత్‌ను పెంచి క్రీస్తును నమ్మే విశ్వాస ఉత్పత్తిని పెంచాల్సిన బాధ్యత మనందరిపైన వుంది.

దీనికనుగుణంగా పరిశుద్ధ పాపుగారు అక్టోబరు 2019 మాసమును ప్రత్యేక సువార్త మాసంగా నిర్ణయించారు. మనకు దేవుడు యిచ్చిన సువార్త పరిచర్యను ఉజ్జీవ సేవగా మలచి, అన్ని ప్రదేశాలలో మన క్రైస్తవ బీజాలను తిరుగదోడి, ప్రతి విశ్వాసి నూతన విశ్వాస ఒరవడిని నింపాలనే ఉద్దేశ్యంతో ఈ మాసంలో పలు విశ్వాస సువార్త ఉజ్జీవ సేవలు కొనసాగించమని ఉద్బోధిస్తున్నారు. పరిశుద్ధ పాపుగారి పిలుపు మేరకు క్రీస్తునందు మన విశ్వాసమును వ్యక్తిగతంగా

సంపాదకీయం

అనుభవించుటకాదు. యితరులకు క్రీస్తును యివ్వడం ద్వారా, వారిని నడవడం ద్వారా వారిలో విశ్వాసమును పెంపొందించు ప్రయత్నాలను చేయుమని ఎక్కువ ఆత్మలను, విశ్వాస యుద్ధం ద్వారా క్రీస్తుకు సంపాదించి పెట్టమని క్రియాశీలకంగా వ్యవహరించమని ప్రేరేపిస్తున్నారు. మరి మనం అందుకు ఎలా ప్రయత్నించాలి.

క్రీస్తు అంటే తెలియని వారికి ఆయనను పరిచయం చేయడం, ఆయనను దర్శింప చేయడం, ఆయనను విశ్వసించునట్లు చేయడం అనే నాలుగు విధాలుగా ప్రయత్నించాలి.

**మొదటిది: నిన్ను నీవు సువార్తకు పరిచయం చేసుకోవడం.** ప్రభువు 30 సం॥లు తనను తాను సువార్తకు పరిచయం చేసుకొని అనుభవించి, అది ఏలా జీవించాలో మనకు నేర్పించారు (లూకా 3:22).

"ఇతను నా ప్రియమైన కుమారుడు. నిన్ను గూర్చి ఆనందించుచున్నాను" అని ప్రభువు నీతో, నాతో కూడ అనాలి.

**రెండవది : నీ కుటుంబాన్ని నిరంతరం సువార్తకు పరిచయం చేయడం, మరియు నిలకడగా జీవింపచేయడం.** తాను నమ్మి తనకుటుంబం మొత్తం ఏసును విశ్వాసం ద్వారా దర్శించిన జైలు అధికారిలా మన కుటుంబం చెరగని విశ్వాసంతో ఎదగాలి (అపో.కా 16:25-33).

**మూడవది : నీవు పనిచేస్తున్న స్థలంలో సువార్తీకరింపబడాలి.** అది నీ జీవిత సాక్ష్యం ద్వారా, ప్రభు సువార్తను ప్రకటించాలి. అపో.కా. 2:43-47.

**నాలుగవది : ప్రపంచమంతట సువార్తను ప్రకటింపబడ చేయడం** (మార్కు 11:5-8). పవిత్రాత్మ అపోస్తులపై వేంచేసినపుడు (అ.కా. 2:1-13) జరిగిన అద్భుత కార్యములు యిలలో జరగాలి. చీకటిలోకం ఏసును కనుగొనాలి. ప్రతి నాలుక ఏసే ప్రభువని విశ్వసించాలి.

**సువార్త సందేశం :** వేదవ్యాపకం అనే అగ్ని పరిశుద్ధాత్మ రాకడతో అపోస్తులలో జ్వలించింది. వారు సువార్త జ్యోతులుగా వెలుగుతూ, ఇతరులకు ఆ వెలుగును, ఆ శక్తిని పంచుతూ, మండుతూ, మండిస్తూ, వేడిమిని, వెలుతురును ఒసగుచూ, మరుగుతూ, మరిగిస్తూ ముందుకు సాగిపోయారు. అలాగే జ్ఞానస్నానం పొందిన ప్రతి వ్యక్తి సువార్త ప్రకటనను, ఒక చైతన్య స్రవంతిలా, వెలిగించే జ్వాలలా, అందరిలో రగిలింప చేయాలి. నూతన చైతన్యమును, నూతన జీవమును పొంది, రగులుతూ, రగిలిస్తూ ముందుకు సాగాలి. ఇదే నిజమైన క్రీస్తు సువార్త ప్రకటన. మనలో ప్రతి ఒక్కరికి ప్రేషిత దౌత్యమును స్వీకరించు సమయము ఆసన్నమైనది. మన సోదరుల ఆత్మీయ దాహమును తీర్చుటకు ప్రభువు మనకు వాగ్దానమొనర్చిన జీవ జలమును ధారాళముగ త్రాగి ఇతరుల ఆత్మీయ దప్పికను తీర్చు ప్రేషితులుగ మారి ఆయనకు సాక్షులుగా మారుదాం.

జీవజలమును దయచేయుమని అడిగిన సమరియ స్త్రీలాగా ప్రభువు పాదాలు చెంత కూర్చొని ఆయన బోధనలను స్వీకరించి, మౌన హృదితో ప్రేమించిన మరియలా, ప్రభువు భౌతిక అవసరాలు తీర్చి తనదైన శైలిలో సేవలను సువార్త ప్రకటనగా మార్చుకున్న మార్తమ్మలా. తన కన్నీటితో ప్రభువు పాదాలను కడిగి, తన పాప ప్రక్షాళనను గావించుకొని ప్రభువు మెచ్చుకోలును సువార్తాంశముగ మారిన మగ్ధలా మరియమ్మలా, మనం కూడా ప్రభు సాక్షులుగా నిలవాలి.

అన్నింటికంటే, అందరికంటే ఎక్కువగా దేవుని చిత్తమును నెరవేర్చి, ధన్యతనొందిన మన అమ్మ మరియ మాతలా, సువార్త సందేశమును మోస్తూ, మననంచేస్తూ, సువార్తను పంచుదాం, పునర్జీవితలవుదాం. పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారి నూతన "ప్రత్యేక సువార్తీకరణ"లో చేయిచేయికలిపి, ప్రభువు సువార్తను భూదిగంతములవరకు ప్రభువు మాట, బాట, జాడ, స్థిరీకరింపబడ మనం అలయక, సొలయక సాగుదాం. విశ్వాస వీరుల్లా, విశ్వాస కవచమును ధరించి, విశ్వాసపు డాలును ధరించి, సువార్త జండా ప్రకృతి అంతా దద్దరిల్లేలా, నింగినేలకూడి అల్లెలూయ గీతాలను ఆలపిద్దాం.

**- ఫా. యర్రమనేని బాలి** ఎస్.డి.బి.

# విశిష్ట వేదవ్యాపక పరిచర్య మాసము, అక్టోబర్ 2019

## పరిశుద్ధ ఫ్రాన్సిస్ పాపుగారి సందేశము



ప్రియమైన సహోదరీ సహోదరులారా! పరిశుద్ధ 15వ బెనెడిక్ట్ పాపుగారి అపోస్థలిక లేఖ "మాక్సిమమ్ ఇల్లుడ్" ను (30 నవంబర్ 1919) శత సంవత్సరం సందర్భంగా స్మరించుకొనుచున్న మనం 2019 అక్టోబర్ మాసంలో శ్రీసభ యావత్తు తన ప్రేషిత కార్యమును, అంకితభావమును పునరుజ్జీవనం గావించాలని కోరుచున్నాను. ఈ లేఖ యొక్క దూరదృష్టి, ప్రవచనాత్మక సందేశము శ్రీసభ ప్రేషిత పరిచర్యను ముందుకు తీసుకెళ్ళాలని సూచిస్తున్నది. నూతన బోధనా పద్ధతుల ద్వారా సువార్తను అందించి క్రీస్తు రక్షణను అందరు స్వీకరించునట్లు పాటుపడాలి.

జ్ఞానస్నానములో మనము పొందిన విశ్వాసమును గుర్తించి దృఢపరచుకోవాలి. దేవునితో మనకున్న తండ్రి సంబంధం కేవలం వ్యక్తిగతంకాదు. శ్రీసభతో సత్సంబంధం కలిగియుండాలి. దేవునితో సంబంధం కలిగియుండి ఇతర అనేకమంది సోదరీ, సోదరులతో పాటు మనం నూతన జీవితమును పొందాము. దీనిని ఇతరులకు తెలియపరచి ప్రకటించాలి. ఉచితముగా పొందాము కనుక మనం కూడ ఉచితముగానే సేవచేయాలి (మత్తయి 10:8). ప్రజలందరు సత్యమును తెలుసుకొని, దేవుని కరుణను అనుభవించాలని, రక్షింపబడాలని దేవుని చిత్తం (1తిమోతి 2:4).

ఈ ప్రపంచంలో తిరుసభ సువార్తను బోధిస్తున్నది. క్రీస్తునందుగల విశ్వాసము ద్వారా సమస్తమును సద్భావనతో చూడగలం. నిరీక్షణ మనలను నిత్య జీవితమువైపు నడిపిస్తుంది. సేవా ధర్మం భూదిగంతములవరకు పయనించి సువార్తను బోధించునట్లు ప్రేరేపిస్తుంది (మత్తయి 28:19; అ.కా. 1:8; రోమా 10:18). శ్రీసభ భూదిగంతములవరకు వ్యాపించాలంటే స్థిరమైన, నిరంతర కృషి అవసరము. క్రీస్తునందుగల ప్రేమచే మాత్రమే అది సాధ్యం. మనము మనకొరకుగాక ప్రభువు కొరకు జీవించాలి. తండ్రి దేవుడు క్రీస్తు ద్వారా మనలను తనతో సఖ్యపరచుకొని, ఇతరులను కూడ ఆయనతో సఖ్యపరచు ప్రేషిత కార్యమును మనకు అప్పగించియున్నారు (2కొరింతి 5:14-18). దేవుని గూర్చి బోధించు వ్యక్తి దేవుని బిడ్డయై ఉండాలి.

జ్ఞానస్నానము పొందిన ప్రతి ఒక్కరికి సువార్త పరిచర్య చేయవలసిన బాధ్యత ఉన్నది. ప్రేమ కలిగినవారు సేవా భావముతో ముందుకు సాగుచూ, ఇతరులను కూడ అదే మార్గంలో నడిపిస్తారు. దేవుని దృష్టిలో అందరు ముఖ్యమైనవారే. తల్లి దండ్రులు బిడ్డలకు న్యాయము చేయలేకపోవచ్చు. కాని, దేవుడు మనకు ఇచ్చిన జీవితమనే వరమును ఉజ్జీవింపచేస్తారు. ఆదియందే దేవుడు తన బిడ్డలమైన మనలను తన దివ్యమైన నిత్యత్వములో పాలుపంచుకొన చిత్తగించారు (ఎఫెసీ 1:3-6).

పాపమును, మరణమును జయించిన క్రీస్తునందు విశ్వాస జీవితం మనకు జ్ఞానస్నానము ద్వారా అనుగ్రహింపబడినది. జ్ఞానస్నానము ద్వారా దేవుని పోలికలో, రూపములో మనం తిరిగి జన్మిస్తున్నాము. తిరుసభలో సభ్యులగుచున్నాము. జ్ఞానస్నానము ద్వారా రక్షణను పొంది దేవుని బిడ్డలగుచున్నాము. ఇతరులు మారుమనస్సు, రక్షణను పొందునట్లు కృషిచేయబద్ధులమై ఉన్నాము.

ఉత్థాన ప్రభువు సువార్త పరిచర్యను గూర్చి ఇచ్చిన ఆజ్ఞ జ్ఞానస్నాన సాంగ్యములో ఇమిడివున్నది. యేసు శిష్యులతో, "నా తండ్రి నన్ను పంపినట్లు నేను మిమ్ము పంపుచున్నాను అని చెప్పి వారికి పవిత్రాత్మ శక్తిని అనుగ్రహించి పాపములు మన్నించు అధికారమును ఇచ్చారు (యోహాను 20:19-23). క్రైస్తవులుగా మనము కూడ ఈ బాధ్యతను కలిగియున్నాము. అందువలన ప్రజలు దేవుని బిడ్డలుగా మారునట్లు కృషిచేయాలి.

క్రీస్తునందు రక్షణ సార్వత్రికముగా అనుగ్రహించ బడినది. కనుక, ప్రజలు జాతీయ విభేదాలకు, జాతుల కేంద్రీకరణకు అతీతంగా వ్యవహరించాలని 15వ బెనెడిక్ట్ పాపుగారు కోరారు. సువార్త ప్రబోధం వలసరాజ్యాల ఆర్థిక, సైనిక ప్రయోజనాలకు అతీతంగా ఉండాలని ఉద్బోధించారు. జ్ఞానస్నానము పొందిన ప్రతి వ్యక్తి సువార్త నిమిత్తం స్వస్థలమును విడచి ప్రభుని ఎరుగని ప్రజలుగల సుదూర ప్రాంతములకు సహితం వెళ్ళటానికి సంసిద్ధత కలిగి కృషిచేయాలని కోరారు. సువార్తను విశ్వసించి, ప్రభువుని అంగీకరించి, రక్షకుడుగా ఒప్పుకొని జ్ఞానస్నానము పొందునట్లు బోధించాలి.

2007లో బ్రెజిల్‌లో జరిగిన లాటిన్ అమెరికన్ బిషప్‌ల సమావేశ ప్రారంభసమయంలో 16వ బెనెడిక్ట్ పాపుగారు చెప్పిన మాటలను గుర్తుకు చేసుకొంటూ, వాటినే నా మాటలుగా కూడ ఇప్పుడు చెప్పుచున్నాను. లాటిన్ అమెరికా, కరేబియన్ దేశ ప్రజలు క్రైస్తవ విశ్వాసమును స్వీకరించుటను ఎలా అర్థం చేసుకొంటారు? వారి పూర్వీకులు వెదికి కనుగొనలేని దేవుడైన యేసుక్రీస్తును వీరు తెలుసుకొని తమ దైవంగా స్వీకరించడమే. జ్ఞానస్నానము ద్వారా దేవుని బిడ్డలుగ దైవిక జీవితమును పొందుచున్నారు. పరిశుద్ధాత్మను పొంది దేవుని వాక్యమును హృదయములో స్వీకరిస్తున్నారు, పరిపూర్ణులగుచున్నారు, సువార్త మార్గములో నడిపింప బడుచున్నారు.

శ్రీసభ సువార్త పరిచర్యను శ్రీసభమాతయైన మన మరియతల్లికి సమర్పించుదాము. తమ దివ్య కుమారుడైన యేసుతో కలిసి, యేసు జననమునుండే ఆ నిత్యకన్య తన సేవాయాత్రను ప్రారంభించారు. క్రీస్తు సువార్త పరిచర్యలో సంపూర్ణముగా పాలువంచుకొని సిలువ క్రింద నిలుచున్నంతవరకు సహకరించారు. శ్రీసభ మాతగా పవిత్రాత్మయందు, విశ్వాసమునందు అనేకులు నూతన జన్మమును పొందుటకు తోడ్పడుచున్నారు.

చివరిగా, పాపుగారి సువార్త సేవా సంఘములను గూర్చి ధ్యానించుదాము. ఇవి సువార్త సేవకు మూలముగా ఉన్నాయి. పాపుగారి సువార్తసేవా సంఘములు ప్రపంచ వ్యాప్తముగా సువార్త పరిచర్య చేయుటకు దోహదపడుతాయి. ప్రార్థన, సువార్త పరిచర్య సంకల్పం, విరాళముల ద్వారా క్రైస్తవులు తమ సహాయ, సహకారములను అందించాలి. ఈ విరాళములు పాపుగారి సువార్తా పరిచర్యలో ఎంతో ఉపకరిస్తాయి. గురు విద్యాలయాల నిర్వహణకు, చిన్నారులలో సువార్త పరిచర్యపట్ల ఆసక్తిని పెంపొందించుటకు, క్రైస్తవుల విశ్వాస పరిధులను విస్తరించుటకు ఉపకరిస్తాయి. విశిష్ట సువార్త బోధనమాసం, అక్టోబర్ 2019, మీ సువార్త పరిచర్యను సూత్రీకరించి, మా సువార్త పరిచర్యకు సహకరించునుగాక!

సువార్త పరిచర్యలో సహకరించు ప్రతి ఒక్కరికి మా హృదయ పూర్వక ఆశీర్వాదము అందిస్తున్నాము. ◆

**(సెప్టెంబర్ నెలలో కుటుంబము-విశ్వాసము అనే శీర్షికలో హెడ్డింగ్‌లో ప్రార్థనా శక్తి ద్వారా కుటుంబ భవిష్యత్తు అనే దానికి కటుంబ అని ముద్రణ జరిగింది. పాఠకులు దీనిని గమనించి క్షమించగలరు.)**



# మన కావలి దూతలు




డా।। కె. రాజారెడ్డి, గుంటూరు
ఫోన్ : +91 9848185177


సాంకేతికంగా మానవులు ఎంతో పురోగతి సాధించారు. భూమినిగూర్చే కాకుండా, చంద్రుడు, సూర్యుడు ఇతర గ్రహాలు, నక్షత్రాలు, ఖగోళం గూర్చి పరిశోధనలు విరివిగా సాగుచున్నాయి. ఇతర గ్రహాలలో జీవరాసి ఉన్నదా? గ్రహాంతర వాసులువున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుచున్నాయి.

గ్రహాంతర వాసుల ఉనికిని సైన్స్ వివరించలేకపోతున్నది. కాని అన్ని మత గ్రంథాలు వాటి ఉనికిని ప్రస్తావిస్తున్నాయి. పవిత్ర బైబిల్ గ్రంథంకూడ దేవదూతల ఉనికిని ప్రకటిస్తున్నది. దేవదూతలనే గ్రహాంతర వాసులుగా పరిగణించవచ్చా? వీరు దేవునికి మానవాళికి అనుసంధానంగా వున్నారు. మానవాళి ఆత్మ శరీర మేలుల కొరకు సహాయపడతారు. దేవుడు తన పరిచర్య నిమిత్తం దూతలను సృష్టించారు. పవిత్ర బైబిల్ ఆధారంగా పునీత థామస్ అక్వినాస్ గారు దూతల విధివిధానాలు, బాధ్యతలను బట్టి దూతల సమూహాలను 3 స్థాయిలుగా, స్థాయికి 3 రకములుగా మొత్తం తొమ్మిది గణములుగా విభజించారు. అవి :

1) ఎగువ స్థాయి : ఎ) సెరాపులు బి) కెరూబులు సి) భద్రాసనులు
2) మధ్యస్థాయి : ఎ) అధిపతులు బి) నాధులు సి) శక్తులు
3) దిగువ స్థాయి: ఎ) రాజ్యాధికారులు బి) అతిదూతలు సి) దూతలు

1) **సెరాపులు :** వీరు అత్యున్నతమైన దేవదూతల గణము. దేవుని సింహాసనమునకు దగ్గరగా వుంటూ ప్రేమతో నిత్యం దేవుని ఆరాధిస్తూ స్తుతిస్తూ వుంటారు. వీరు "సర్వ శక్తిమంతుడైన ప్రభువు పవిత్రుడు, పవిత్రుడు, పవిత్రుడు. లోకమంతయు అతని మహిమతో నిండియున్నది" అని యెలుగెత్తి గాన ప్రతిగానములు చేస్తూ వుంటారు. సెరాఫీము దేవదూతలు ఒక్కొక్కరికి ఆరు రెక్కలుంటాయి. వారు రెండు రెక్కలతో తమ ముఖాన్ని, రెండు రెక్కలతో కాళ్ళను కప్పుకొని, రెండింటితో ఎగురుతూవుంటారు. (యెషయా 6:1-3). చిత్రపటాలలో ఎరుపు రంగు దుస్తులతో ప్రజ్వలించే దీపములతో వీరిని చూడగలం.

**కెరూబులు :** కెరూబులు దేవుని నిత్యము ఆరాధిస్తుంటారు. దైవజ్ఞానానికి గుర్తుగా వీరి చేతులలో గ్రంథాలు కనబడతాయి. వీరికి బంగారు వర్ణము లేదా నీలిరంగు కేటాయిస్తారు. కెరూబు దూతకు నాలుగు ముఖాలు వుంటాయి. మొదటిది వృషభ ముఖము, రెండవది సింహ ముఖము, మూడవది మనుష్య ముఖము, నాల్గవది గురుడ ముఖము. కెరూబుల క్రింద నాలుగు చక్రములుంటాయి. కెరూబుకు నాలుగు కలిసియున్న రెక్కలు వుంటాయి. కెరూబు రెక్కల క్రింద మనుష్య హస్తముల వంటివి ఉంటాయి. వాని దేహము వీపులు, చేతులు, రెక్కలు, చక్రములు కన్నులతో నిండి వుంటాయి (యెహెజ్కేలు 10:1-17).

ఆదాము ఏవలు ఏదేను వనము నుండి వెలుపలికి పంపబడిన తరువాత దేవుడు కెరూబులను ఆ తోటకు జీవ వృక్ష ఫలాలను ఎవ్వరు తినకుండ కాపలా ఉంచాడు (ఆది. 3:24).

**భద్రాసనులు :** వీరు దైవ న్యాయానికి, ధర్మానికి, అధికారానికి ప్రతీకలు. న్యాయాధిపతుల దుస్తులలో, చేతులలో అధికార దండముతో ఉంటారు. వీరు దేవుని సింహాసనానికి పరిరక్షకులు, సింహాసనమును ఒక గుర్తుగా కలిగి వుంటారు. దేవుని నిత్యం ఆరాధించు పెద్దల బృందముగా ఉన్నారు. దేవుని చిత్తమును నెరవేరుస్తారు. ప్రజల ప్రార్థనలను దేవునికి సమర్పిస్తారు. దర్శన గ్రంథములోని 24 మంది పెద్దలు ఈ సమూహామునకు చెందినవారే కావచ్చు. దేవుని నుండి మహిమను పొందుతూ ఆ మహిమను 2వ తరగతిలోని దూతలకు సంక్రమింప జేస్తుంటారు.

## కావలి దూతలు

**2. అధిపతులు లేక ప్రభువులు :** రెండవ క్రమములోని దేవదూతలు ఖగోళము, నక్షత్ర మండలములాంటి వివిధ అంశాలకు ప్రతినిధులు. వీరు మూడవ క్రమములోని దూతలను దైవ మహిమతో ప్రకాశింపజేస్తారు (ఎఫెజి 1:21; కొలస్సీ 1:16). వీరు దిగువస్థాయి దేవదూతల విధులను పర్యవేక్షిస్తారు. అతి తక్కువ సందర్భాలలోనే మానవులకు దర్శనమిస్తారు. దివ్యమైన సుందర మానవులుగా రెండు రెక్కలతో ఉంటారు. వెలుగుచున్న చిన్న గోళములుగల పాలనాదండమును బూని వుంటారు.

**నాథులు లేక సౌశీల్యురు :** ఈ దేవదూతలు ప్రపంచములో సూచక క్రియలు, అద్భుతాలు చేస్తారు.

**సమర్థులు :** ఈ దేవదూతలు విశ్వములోని గ్రహములు, సూర్య చంద్ర నక్షత్రాల గమనమును పర్యవేక్షిస్తూ నియంత్రిస్తుంటారు. వీరు యోధులు. ఆకాశమందలి దురాత్మలతో పోరాడుతారు, నియంత్రిస్తారు, నిర్బంధిస్తారు. ఈ దూతలను కవచము, శిరస్త్రాణములను ధరించి, డాలు బల్లెమును చేతబూని యున్న యుద్ధ యోధులుగా చిత్రీకరిస్తారు.

**3. రాజ్యాధికారులు :** ఈ దూతలు దేవుని శక్తిని ప్రతిబింబిస్తారు. వీరికి కిరీటాలు, అధికార దండాలు అన్వయిస్తారు. పై స్థాయి దేవదూతలు ఇచ్చిన ఆజ్ఞలను నెరవేరుస్తారు. ప్రజలకు ఆశీర్వాదములను తీసుకొనివస్తారు. కళలను, శాస్త్రములను ప్రజలలో ప్రేరేపిస్తారు. ప్రజా సమూహాలను పర్యవేక్షిస్తారు. సంస్థలను రాజ్యములను, దేశాలను నడిపిస్తూ సంరక్షిస్తారు. క్రింది స్థాయి దేవదూతలను పర్యవేక్షిస్తూ దైవ కార్యములను నెరవేర్చునట్లు చూస్తారు. వీరిలో కొందరు పాలకులుగాను, కొందరు సహాయకారులుగాను వుంటారు (ఎఫెజి 1:21; 3:10).

**అతిదూతలు :** వీరు 7 గురు ప్రధాన దూతలు. దేవుని సమక్షంలో వుండి, దేవుని స్తుతిస్తూ సేవించుటకు సిద్ధంగా వుంటారు. వీరి పేర్లు 1 ) మిఖాయేలు 2) గాబ్రియేలు 3) రఫాయేలు 4) ఉరియేలు 5) సెలాఫియేలు 6) రగుయేలు 7) బరాకియేలు. మొదటి ముగ్గురి పేర్లు బైబిల్‌లో చూడగలము. మిగిలిన నలుగురిపేర్లు సాంప్రదాయములో కనుగొనగలము. వీరందరికి పెద్ద మిఖాయేలు. మిఖాయేలు అనగా దేవుని పోలినవాడు అని అర్థం. బలవంతుడు దేవుని పక్షాన యుద్ధం చేస్తాడు. గాబ్రియేలు అనగా "దేవుడు నా బలము అని అర్థం. ప్రధానంగా దైవ సందేశానికి వార్తాహరుడు. మంగళవార్తను ప్రకటించువాడు కనుక ఈయన చేతిలో ఒక లిల్లీ పుష్పంగానీ, ఒక రాజదండముగాని కనిపిస్తాయి. ఇంకొక చేతిలో ఒక ఫలకము, దానిమీద "దేవవర ప్రసాదములతో నిండిన మరియా! నీకు శుభము అనే పదాలు వుంటాయి."

**రఫాయేలు :** 'దేవుని వైద్యం' అని ఈ పేరునకు అర్థం. తోబీతు గ్రంథములో వీరిని సంరక్షకుడుగా చూస్తాము. ప్రయాణించే వారిని, యాత్రికులను సంరక్షిస్తారు.

**ఉరియేలు :** దేవుని వెలుగు అని ఈ పేరు అర్థము.

**దూతలు :** వీరు దిగువస్థాయి దూతలు. ఎక్కువగా గుర్తించ బడినవారు. ప్రజలతో ఎక్కువ సంబంధం కలవారు. వేరు వేరు దూతలు భిన్నమైన బాధ్యతలను నిర్వహిస్తారు. వార్తాహరులు కూడా పంపబడతారు. కావలి సన్మనస్కులు ఈ గణమునకు చెందినవారే.

**దూతల లక్షణములు :** పరిశుద్ధ గ్రంథము ప్రకారము దూతలకుగల లక్షణములను తెలుసుకొందాము.

1) దూతలు ఆత్మ స్వరూపులు 2) వీటికి మరణము లేదు 3) ఇవి అసంఖ్యాకంగా సృష్టించబడ్డాయి 4) వీటికి లింగబేధము లేదు 5) పునరుత్పత్తి వీటియందు లేదు 6) వయో తారతమ్యము లేదు 7) దర్శనము ఇవ్వగలవు. అదృశ్యము కాగలవు 8) దేవుని సమక్షములో దేవుని స్తుతిస్తూ దైవకార్యములను నిర్వర్తిస్తూ వుంటాయి. 9) స్థాయి బేధములు కలిగి వుంటాయి. 10) దైవ తేజస్సుతో వెలుగొందుతూ పవిత్రముగా, ఆనందంగా ఉంటాయి.

**కావలి దూతలు :** శ్రీసభ అక్టోబరు 2వ తేదీన "కావలి సన్మనస్కుల పండుగ"ను కొనియాడుచున్నది. వారిని మనం స్మరించి గౌరవించి కృతజ్ఞతలు చెల్లించాలి. సన్మనస్కులే మనుష్యులకు సంరక్షకులుగా ఉంటున్నారు (మత్తయి 18:10). జ్ఞానస్నానం పొందినవారికి మాత్రమే కాకుండా ఈలోకంలో జన్మించిన ప్రతి ఆత్మకు కావలిదూత ఉంటారు.

**పునీత అగస్టీన్‌గారు :** వీరి మాటలననుసరించి "ఈలోకంలో దీన యాత్రికులమైన మనపట్ల దూతలు దయకలిగి వుంటాయి. దైవాజ్ఞ ప్రకారం మనకు సహాయం చేస్తాయి. ఎచ్చటికి వెళ్ళినా అవి ఎల్లపుడు మనతోనే వుంటాయి. మన ఆత్మ శరీరాలను అన్ని రకాల కీడులనుండి కాపాడుతాయి. సైతాను శోధనలను జయించుటకు తోడ్పడుతాయి. సత్క్రియలు చేయుటకు ప్రోత్సహిస్తాయి. ఆత్మ కీడుల విషయములో హెచ్చరిస్తాయి. మన మనవులను దేవుని సమక్షానికి చేరుస్తాయి.

**పునీత జెరోముగారు :** మానవుని ఆత్మ పరిశుద్ధంగా ఉండాలనే ఉద్దేశముతో దేవుడు ఒక్కో మనిషికి కావలి సన్మనస్కుని ఏర్పాటు చేశారు.

**పునీత బెర్నార్డుగారు :** నీ కావలి దూతలను గౌరవించు. నీ కోసమై తాను కల్పిస్తున్న భద్రతకై కృతజ్ఞుడవైవుండు. వారిపట్ల, ప్రేమ, నమ్మకము కలిగియుండుము. శోధనలోను, కీడులలోను వారి సహాయము కొరకు ప్రార్థించు అని అన్నారు. "ప్రభువు నిన్ను తన దూతల అధీనమున ఉంచును. నీవు ఎచటికి వెళ్ళినను వారు నిన్ను కాపాడుచుందురు" అని కీర్తనకారుడు తెలుపుచున్నాడు.






**సిస్టర్ తెరేసా వనమాల**
సెయింట్ ఆన్స్ జనరలేట్
సన్ సిటీ, హైదరాబాద్, +91 8106783853

జపమాల ప్రధానంగా పూర్వ యుగాల ప్రార్థనా మనస్తత్వంలో ఉద్భవించిన ఒక లేఖన ప్రార్థన. ప్రస్తుత సమయంలో దీనిని "మేరీస్ సాల్టర్" అని కూడా పిలుస్తారు. సమయంలేని, విద్యనభ్యసిస్తున్న మరియు దైవ కార్యాలయంలో ఎక్కువ గంటలు ప్రార్థన చేసే అవకాశం లేని వ్యక్తులకు 150 కీర్తనలకు, 150 మంగళవార్త జపాలు ప్రత్యామ్నాయంగా భావించే కథోలికులు ఇప్పటికీ ఉన్నారు. అందువల్ల "మేరీస్ సాల్టర్" అనేది చర్చి యొక్క సాధారణ గంట-ప్రార్థనతో పాటు క్లుప్తమైన, సరళీకృతమైన "సంక్షిప్త" ప్రార్థనగా జపిస్తూ ఉంటారు. మరియమాత పేరిట మనం జరుపుకునే వేడుకలన్నీ నిజంగా యేసుక్రీస్తును గూర్చిన వేడుకలుగానే చెప్పవచ్చు. ఎందుకంటే, మరియమాత పొందుకున్న కృపానుగ్రహము మరియు ఆమెకు ఆపాదించబడిన గౌరవం దేవుని కుమారుని నుండి మాత్రమే వచ్చింది అనేది క్రైస్తవ విశ్వాసం. మరియమాతలో సంతోషించటం అంటే, దేవుని గొప్ప సృష్టిని గౌరవించి ఆయనను మహిమపరచటమే. అందుకే జపమాలను సర్వజనావళి ప్రార్థనగా కూడా పేర్కొంటారు. ప్రస్తుత కాలములో చూసినట్లయితే జపమాలను ధరించేవారి సంఖ్య ఎక్కువనే ఉందని చెప్పాలి. కొందరు భక్తితో ధరిస్తే, కొందరు బాధల విముక్తి కొరకు ధరిస్తారు. కొందరు జపమాలను భయంగా భావిస్తే, కొందరు అభిరుచిగా భావిస్తారు. ఏది ఎలా ఉన్నా మన అనుదిన జీవితంలో జపమాల అందరి ఆయుధంగా మారిందని మాత్రం చెప్పవచ్చు. మరి అసలు జపమాల మూలం ఎక్కడి నుండి వచ్చింది? ఎందుకు వచ్చింది అనేది మనం ధ్యానించవలసిన విషయం.

**జపమాల మూలం ఏమిటి?:** పరిశుద్ధ జపమాలను గురించి ఖచ్చితమైన మూలాలు పరిశుద్ధ గ్రంథములో వివరించ లేనప్పటికీ, మొట్టమొదటిగా పరిశుద్ధ జపమాలను 3వ మరియు 4వ శతాబ్దములోని సన్యాసులు తమ ప్రార్థనను చెప్పే రీతిలో పొడుగాటి తాడును తీసుకొని ముడివేసుకుంటూ పోయేవారని, కాలక్రమేణా ఈ ముడివేసిన తాడుని జపమాలగా ఉపయోగించారని చెప్పేవారు. తిరుసభ విశ్వాసం ప్రకారం జపమాలను మొట్టమొదటిగా పునీత దోమినిక్ గారికి ఒక దర్శనములో ఒసగినట్లుగా కూడా మనం గమనించవచ్చును. జపమాలలోని పదాలు మనిషి సృష్టించినవి కావు, ఇవి దైవికంగా నియమించ బడినవి మరియు యదార్థమైన పరిశుద్ధ గ్రంథ ప్రార్థనలు. మనకు ఎదురయ్యే ఆపదలు మరియు అవసరాలలో

మరియతల్లి మనకు నేర్పే ప్రార్థన. జపమాల అనేది ఒక ఆధ్యాత్మిక మేల్కొలుపు. చదువుకున్న, చదువుకోలేని ప్రతి క్రైస్తవుడు సులువుగా ప్రార్థించగలిగే మరియు విశ్వాసు లందరినీ తన కుమారుడి వైపుకు నడిపించే మన మరియ తల్లి ఆశీర్వాద ప్రార్థన. జపమాల యొక్క సంతోషకరమైన, దుఃఖకరమైన, మహిమాన్వితమైన మరియు అద్భుతమైన వెలుగు రహస్యాల ద్వారా ప్రయాణిస్తున్నప్పుడు, యేసు ప్రభుని జననం, మరణం మరియు మృతుల నుండి ఆయన పునరుత్థానమును గుర్తు చేసుకుంటున్నామని మరియు క్రీస్తు రక్షణ చరిత్రను ధ్యానిస్తున్నామని కూడా అర్థం. ఈ రహస్యాల ధ్యానం వలన మన జీవితాన్ని ప్రభువుతో మరింత సన్నిహితంగా మెలగడం లోనూ మరియు క్రీస్తులో మన విశ్వాసమును బలపరుచుకుంటూ ఆయన కృప సహాయాన్ని అర్థిస్తున్నామని భావం. జపమాల వంటి పూసలతో ప్రార్థనలు సలపటం క్రైస్తవ సన్యాస ప్రార్థనా సమయాలను అనుకరించ టానికి లౌకికులు ఒక అభ్యాసంగా ప్రారంభించి ఉండవచ్చును. అని, అంతేకాకుండా పరిశుద్ధ గ్రంథములోని 150 కీర్తనలకు ప్రత్యామ్నాయంగా ప్రతి క్రైస్తవుడు ప్రార్థించే ప్రార్థన అని కూడా చెప్పవచ్చును.

**జపమాలను ఎందుకు జపించాలి?:** జపమాలను ప్రార్థించడం ఓ ఆధ్యాత్మిక అవసరం. ఎందుకంటే, ఇది క్రైస్తవ ప్రార్థనను ప్రోత్సహిస్తుంది. మోక్ష చరిత్రలో వివిధ సంఘటనలపై ధ్యానం చేయడానికి మరియు వాటిని మన జీవితంలో అన్వయించు కోడానికి సహాయపడుతుంది. పరిశుద్ధ మరియతల్లి స్వయంగా స్వర్గం నుండి వచ్చి ప్రతిరోజూ ఈ ప్రార్థన ద్వారా తన కుమారుడితో మనల్ని ఏకం చేయడానికి చూపిన రక్షణ మార్గం.

దేవుడు శాశ్వతమైనవాడు మారనివాడు మరియు వాగ్దాన పురుషుడు. ఈ స్త్రీ (మరియతల్లి ) ద్వారానే మానవ అవతారం పొందినవాడు. కనుకనే తిరిగి మరియతల్లి ద్వారానే మనలను తన చెంతకు చేర్చుకోవాలనే ఉద్యేశ్యముతోనే ఆ తల్లి ప్రార్థనతో మనల్ని చేరుకోదలిచారు.

క్రైస్తవ జీవితానికి మరియు మోక్షానికి ఆధారం వినయం, ఆ వినయానికి మాతృకైన ఆమె మధ్యవర్తిత్వమును కోరుతూ ఆ పరిశుద్ధతల్లి పిల్లలమైన మనలను క్రీస్తుతో ఐక్యం చేయమని వినమ్రతతో మరియతో కలిసి ప్రార్థించడం.

"జపమాలను జపించే సైన్యాన్ని నాకివ్వండి, వారి ద్వారా నేను ప్రపంచాన్ని జయించగలుగుతాను" అని పోప్ పయస్ IX గారు జపమాలశక్తిని వివరించారు. "జపమాల మరియు ఉత్తరీయుము ద్వారా మరియతల్లి ఈ ప్రపంచాన్ని జయిచగలుగుతారు" అని పునీత దోమినిక్ గారు విశ్వసించారు. "ప్రపంచాన్ని రక్షించగలిగే గొప్ప ఆయుధము" అని పాద్రిపియో వచించారు.

ప్రతికూల మరియు ఆమోదయోగ్యం కాని సమయాలలో కూడా జపమాల ఒక శక్తివంతమైన సాధనం. వేదాంత పండితులు వివరించిన దాని ప్రకారం జపమాల చెడును వ్యతిరేకంచగల ఖడ్గము. అందువల్లనే చాలా మంది మఠవాసులు తమ నడుము బెల్ట్ వద్ద జపమాలను ధరిస్తారు. మరియతల్లికి గౌరవం ఇస్తూనే రక్షకుడు క్రీస్తును చేరుకోవడానికి, మార్గమును వెతుక్కోవడానికి జపమాల మనకు సహాయ పడుతుంది.

ఇది యేసుక్రీస్తు తల్లితో ముడిపడి ఉన్నప్పటికీ మానవ ఉనికిలోని సమస్యల యొక్క ప్రతి ముగింపుకు అయాచిత మార్గంగా జపమాలను చెప్పవచ్చు. జపమాలను జపించడం ద్వారా స్వచ్ఛమైన మరియు వివేకవంతమైన హృదయమును కలిగించి యేసు తల్లి మరియ యొక్క దయార్ద్ర హృదయమును మనలో కలిగిస్తుంది.

జపమాలను జపించడమంటే మతపరమైన బాధ్యతలను మరియు సిద్ధాంతాలను చూడకుండా క్రైస్తవులు మరియు కథోలికులుగా మనం ఎవరో తెలుసుకోవడం మరియు అంగీకరించడం వంటి ధ్యాన ప్రయాణం. అందుకే తిరుసభ జపమాలను మన కథోలిక తిరుసభ యొక్క అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రార్థనలలో ఒకటిగా గుర్తించింది.

**జపమాల ఉపయోగం - వినియోగం:** జపమాల కఠినమైన పాపులను మార్చగలిగి మనలో విశ్వాస బీజాలను మొలకెత్తింప చేసే క్రైస్తవ విస్వాస విత్తనం. జపమాల ఎందుకు శక్తివంతమైనదంటే ఇది దేవుడే స్వయంగా స్వరపరిచిన ప్రార్థనల సంపుటి కనుక. గాబ్రియేలు దేవదూత మరియతల్లిని గౌరవించి, ఆమె ద్వారా వాక్యరూపధారుడైన క్రీస్తును వందించి, దేవ దేవుడు పలికించిన పలుకుల వరామాలను జ్ఞప్తికి పరచుకుంటూ క్రీస్తులో మరియు క్రీస్తుతో కలిసి జీవించటానికి మనల్ని మనం సిద్ధపరచుకునే గొప్ప సాధనం. ఈ గొప్ప సాధనమును మన అలవాటుగా మార్చుకొని మరియతల్లి నీడలో క్రీస్తుతో లీనమవడానికి ప్రయత్నిద్దాం. ◆




బ్రదర్ సిహెచ్. గ్రెగరి, యస్.డి.బి.
డాన్‌బోస్కో, కర్నూలు
ఫోన్ : +91 9849085972



పునీత జోజప్పగారికి అంకితం చేయబడిన మన సలేషియన్ ప్రావిన్స్, హైదరాబాద్ సలేషియన్ బ్రదర్ల దైవ పిలుపును ప్రత్యేకంగా ప్రోత్సహించేందుకు, ఈ పిలుపులోని మార్గదర్శక సూత్రాలను విశదపరిచేందుకు పునీత అస్సీసిపుర ఫ్రాన్సీస్‌గారిని పాలకులుగా, సంరక్షకులుగా ఎన్నుకొని, వీరి పండుగ అక్టోబర్ 4న బ్రదర్ల వార్షికోత్సవపు దినముగా నిర్ణయించబడినది. కావున హైదరాబాదు ప్రావిన్సులోని ప్రతి సలేషియన్ కుటుంబం సలేషియన్ బ్రదర్ల దైవపిలుపుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయవలసినదిగా మన బాధ్యత అని గుర్తించాలి (అపో. 2:42).

సౌభ్రాతృత్వం మన క్రైస్తవత్వంలో నిగూఢ విలువ అని "మానవత్వం"గల మనషులందరికి తెలుసు. మానవత్వం అనేది మనిషిలో ఉంటే నైతిక విలువలు వాటంతటకవే వస్తాయనడంలో సందేహంలేదు. శ్రీసభలోని ప్రతి విభాగం దీనిని పరిగణనలోకి తీసుకొని, మనస్ఫూర్తిగా అట్టి విలువలకు బహు ప్రాధాన్యతం ఇవ్వవలసిన ఆవశ్యకత ఎంతో వుంది (రోమా 9:12-18).

సర్వశక్తిగల సృష్టికర్త తన పవిత్ర హస్తములచే, మానవునికోసం సుందరమైన సృష్టిని ఏర్పాటుచేసి, తన ఏకైక కుమారుని మనందరికి సహోదరునిగా పంపించారు. ఆయన మానవాళికంతటికి ఒకే సమాజంలో మెలిగి సుసంపన్నమైన సహెూదరత్వాన్ని చూపారు. అలానే మన సహోదరుడు పునీత అస్సీసిపుర ఫ్రాన్సీస్ మానవ సమాజ సౌభ్రాతృత్వాన్ని ఏర్పరచుటలో జీవితమును అంకితం చేశారు. ఆ పునీతుని అడుగు జాడలలో మనమంతా ఒకరినొకరు నిష్కపటమైన ప్రేమలో, సోదరభావములో జీవించవలెనని పిలువబడితిమి.

**సలేషియన్ బ్రదర్ మఠవాసుల జీవిత సౌభాగ్యాలను పెంపొందించుట :** క్రీస్తు సంఘములో సోదర భావాన్ని, సహోదర తత్వాన్ని నిలకడచేసి, వృద్ధిచేసి తద్వారా మొదటి క్రీస్తు సంఘములను ఆదర్శముగా తీసుకొని ముందుకు సాగాలని ఉద్దేశముతోనే శ్రీసభలో మఠవాస జీవితం అంకురార్పణం గాంచింది. ఇట్టి శ్రీసభ పునఃనిర్మాణ పవిత్ర కార్యంలో భాగంగా మఠవాస జీవితాన్ని జీవించే సలేషియన్ బ్రదర్లందరూ, దేవుని బిడ్డలు, ఇదే సహోదరత్వాన్ని ప్రతి గృమములోను, విచారణలోను, పాఠశాలలందును, సమాజమునందును, మఠ సంఘాలలోను వృద్ధి చెందాలనే ప్రక్రియతో జీవితాన్ని అంకితం చేసుకుంటున్నారు.

"సేవించుటలో అనేక పద్ధతులున్నవి. కాని సేవలను అందుకొను ప్రభువు ఒక్కడే. సేవ చేయు సామర్థ్యములు అనేకములున్నవి. కాని అన్ని సేవలకును, అందరకును ఒకే దేవుడు సామర్థ్యమునొసగును" (1కొరింతి 12:5-7).

**"మీరందరు సోదరులు" (మత్తయి 23:8) :**

ఈ సందేశ నిజ అర్థాన్ని ప్రప్రథమ తిరుసభ ఆకళింపు చేసుకొన్నది. "మీరందరు సోదరులు" నిజంగా ఈ సోదరత్వానికి కట్టుబడినవారు హృదయంలోను, మనస్సులోను విశ్వాస పాత్రులయ్యారు. క్రీస్తు సంఘ స్థాపనకు, పురోగతికి ఈ క్రైస్తవ సహోదరత్వానికి కట్టుబడిన వారు హృదయంలోను, మనస్సులోను విశ్వాస పాత్రులయ్యారు. క్రీస్తు సంఘ స్థాపనకు, పురోగతికి ఈ క్రైస్తవ సహోదర సంఘాలు పునాది వంటివి. శ్రీసభ ఆవిర్భావం నుండి నేటి వరకు ఎప్పుడైతే ఈ అంశం పరిగణలోకి తీసుకోబడిందో, అప్పుడు సహోదరీ సహోదరులుగా జీవించే మఠాలు ఏర్పడ్డాయి. శ్రీసభలో ఐక్యత, సుమాతృకలు, ఆదర్శ జీవితము వృద్ధిచేయబడి, జీవితాన్ని ధన్యం చేసుకోవాలనేదే శ్రీసభ ఉద్దేశ్యం. ఇట్టి అనుకూల పరిస్థితులు నెలకొనాలంటే "సోదరబావం" "సౌభ్రాతృత్వం" అనేవి ప్రపంచపు నలుమూలలా, మరీ ముఖ్యంగా సలేషియన్ కుటుంబాలలో కార్యరూపం దాల్చాలి. ఇదియే క్రైస్తవ జీవిత, సలేషియన్ సభ్యుల జీవితమార్గ సరళి.

**పండుగ సందర్భముగా సలేషియన్ సభ్యుల ప్రార్థన :**

గురువు : ప్రియ దైవ బిడ్డలారా! డాన్‌బోస్కోగారి అనుచరులుగా ఒకరినొకరు సహవాసమునందు జీవించేందుకు ఆహ్వానించిన దేవునికి మనమంతా స్తుతులను తెల్పుతూ ప్రార్థించుదము.

అందరు : ఓ ప్రభువా! ఫ్రాన్సీస్ అస్సీసీ ద్వారా మా ప్రార్థన ఆలకించండి.

ఒకరు : ప్రపంచ నలుమూలలా వ్యాపించిన, క్రైస్తవ సంఘాలను దృఢంగా వెలుగు బాటలో నడిపించే వరములను క్రుమ్మరించాలని, మన శ్రీసభ పాలకులైన ఫ్రాన్సీస్ పాపుగారిని దీవించమని.... అందరు :...

ఒకరు : పునీత అస్సీసిపురి ఫ్రాన్సీస్ గారిని సుమాతృకగా స్వీకరించి, సలేషియన్ సభలో జీవితమును అంకితం చేసిన బ్రదర్లందరూ, వీరి ప్రార్థనా సహాయముచే వారి వారి వాగ్దానములకు కట్టుబడి జీవించులాగున దీవించమని... అందరు :

ఒకరు : సువిశేష బోధన ప్రకారం సలేషియన్ నియమ, నిబంధనల ప్రకారం మఠవాస జీవితములో గురువులు, బ్రదర్లు, సహోదరత్వములో దేవుని ప్రేమకు, సేవకు నిజ సాక్షులుగా జీవించే వరమును ప్రసాదించమని... అందరు :

ఒకరు : పునీత అస్సీసిపుర ఫ్రాన్సీస్ గారివలే, మన మందరము సోదర భావాన్ని ప్రతి ఒక్కరిపై చూపి ప్రేమకు ఊటగాను, అనుగ్రహనిధిగాను కలుగజేసే వరమును ప్రసాదించమని... అందరు:

ఒకరు : మన దేశములో, మన ప్రావిన్స్‌లో మఠవాస జీవితంలో బ్రదర్సుగా జీవిస్తూ, బ్రదర్స్ డే పండుగను కొనియాడుతున్న వారంతా దేవునిచే నిండుగా ఆశీర్వదించబడెవలెనని, వీరి జీవితం, దృఢ విశ్వాసములో ముందుకు సాగే వరమును ప్రసాదించమని... అందరు :

ఒకరు : ఈ లోకంలో ప్రతి ఒక్కరు ఆశించే సోదర భావం, సౌభ్రాతృత్వం, ఏనాటికైనా నిజ స్వరూపం గాంచాలని, ప్రపంచములో శాంతి సమాధానాలు వర్ధిల్లే వరములు క్రుమ్మరించుమని... అందరు :

ఒకరు : పరలోకమందున్న మా తండ్రీ! శ్రీసభకు మీరు ప్రసాదించిన అనేక విధములైన కానుకలకు మీకు వందనములు. మా దీన ప్రార్థనలను దయతో ఆలకించి మా దైవ పిలుపు నందు బలపరచండి. ఈ మనవులన్నీ, మా నాధుడైన క్రీస్తునాధుని ద్వారా వేడుకొనుచున్నాము... ఆమెన్.

**పునీత అస్సీసిపుర ఫ్రాన్సీస్ గారి ప్రార్థన :**

"ప్రభూ! మమ్ము శాంతి స్థాపకులుగా చేయుము."
గాయం ఉన్నచోట – మన్నింపును
సందేహం ఉన్నచోట – విశ్వాసాన్ని
నిరుత్సాహం ఉన్నచోట – చిరునవ్వును
అంధకారం ఉన్నచోట – వెలుగును
బాధవున్న చోట – సంతోషాన్ని
నెలకొల్పడమే క్రైస్తవ సహోదరుని కర్తవ్యము.



# దోమినిక్ సావియో యవ్వన జీవితం

ఫ్రాన్సిస్ ది సేల్స్‌గారి ఆరెటరీలోని విద్యార్థి

**ధారావాహిక - 10**

“డాన్‌బోస్కోగారు స్వయంగా రచించిన పునీత దోమినిక్ సావియోగారి సంక్షిప్త జీవిత చరిత్ర”

అనువాదం : డి. మనోహర్, తెలుగు పండిట్, చందూరు

**(గత సంచిక తరువాయి)**

నీవు సరిగ్గా చెప్పావు. నేను చాలా సంతోషంగా వున్నాను. నేను నా మనసును ఇకపై క్రమంగా పాప సంకీర్తనమునకు వెళ్ళడానికి నిర్ణయించుకున్నానని తెలియజేశాడు. ఏ సమూహములోనైనా, ఏ వయసులోని వారైనా, ఎంతవారైనా, వారి సహచరులచేత వారి స్వయం నిర్ణయానికి వదిలివేయబడతారు. ఇది ఎందుకనగా, వారు స్వభావములో చాలా కఠినముగా కనబడుటయే కారణము. చేతగానివారివద్ద పని చేయడమే దానికి తగిన కారణము. దానిని జయించలేకపోవడమే కారణము వారికి కావలసినదల్లా, నమ్మకమైన స్నేహం. ఈ స్నేహం లేకపోవుట వలననే వారు బాధపడుతుంటారు. అలాంటి వారికి మిత్రుడుగా ఉండేవాడు దోమినిక్. విరామసమయాలలో వారితో ఆడేవాడు. కావాలని మాట్లాడేవాడు. వారు పొరపాట్లు చేసినప్పుడు సరిదిద్దేవాడు. లేకపోతే వారే యితని మాట పాటించేవారు కూడా. అతడు మంచి వాడని, వారి మంచికే పాటుపడేవాడని నమ్మారు. బాలుర ఎవరైనా అనారోగ్యముగా ఉన్నారని తెలిసినచో, దోమినిక్ అట్టి వారిని కలిసి వారి బాధలను తనకు చెప్పమని కోరేవాడు. ఆవిధముగా వారు తన దగ్గరకు అన్నివేళలా వచ్చునట్లు, వారి కోసం దేవుని దగ్గర వారికి మేలు కల్గునట్లు ప్రార్థించుటకు సిద్ధపడేవాడు.

**దోమినిక్ ప్రార్థనాత్మ – దేవుని తల్లి యెడల భక్తి – మేరీమాత మాసము** : దేవుడు దోమినిక్‌కి ఇచ్చిన వరాలలో గొప్ప వరం ఆరాధన పూర్వకమైన ప్రార్థన. తన ప్రయత్నాల ఫలితంగా అతడు దేవునితో చాలా అభిమానంగా మాట్లాడేవాడు. తాను ఎక్కడ వున్నా, ఎటువంటి చట్టాలు చుట్టూవున్నా తనను తాను జ్ఞాపకం చేసుకోవడం చాలా తక్కువగా యుండేది. కాని తన హృదయము మాత్రం ఎల్లప్పుడూ దేవునికై తపించేది.

దోమినిక్ ఇతరులతో కలిసి ప్రార్థించేటపుడు దేవదూత వలే కన్పించేవాడు. అతడు మోకాళ్ళమీద కదలకుండా ఉండేవాడు. అతని ముఖం ప్రకాశవంతంగాను, తలకొద్దిగావంచి, కళ్ళు కొద్దిగా మూసి ప్రార్థనలో కన్పించేవాడు. అతడు రెండవ అలోషియస్‌లా కన్పించేవాడు. 1854లో కౌంట్‌కేస్ యందు పునీత అలోషియస్ సొడాలిటీకి గౌరవప్రదమైన అధ్యక్షుడుగా పాఠశాలయందు స్థాపించ బడ్డారు. వారు దేవాలయ, పూజా కార్యక్రమాలు మొదటిసారి దర్శించడానికి వచ్చినపుడు అక్కడ ఒక బాలుడు స్పష్టంగా ఎంతో భక్తితో, ఎంతో ఏకాగ్రతతో ప్రార్థించు చుండుట చూచి, చలించిపోయాడు. తర్వాత అతడెవరని అడిగాను. అతడు సావియో అని తెలియజేశారు.

దోమినిక్ తనకు దొరికిన కొద్ది సమయములో మంచి గ్రంథము చదువుతూ కనబడతాడు. లేదా దేవాలయమును దర్శిస్తాడు. అతడికి సాధారణముగా తనతో కొంతమంది బాలురు ఉంటారు. వారందరు కలిసి, మరియమాత గౌరవార్థం ఉత్తరించు స్థలం ఆత్మల విమోచనకై ప్రార్థించడం తమ హక్కుగా భావిస్తారు. మరియతల్లియెడల అతనికి గల భక్తికి అవధులు లేవు. మరియతల్లికి గౌరవార్థముగా ప్రతిరోజు

తన దేహమును శుష్కింపచేసుకునేవాడు. అతడు ఎప్పుడు బాలికలవైపు తదేకంగా చూడడంగాని, చలించడంగాని, చేయలేదు. దారిగుండా ప్రయాణించేటప్పుడు పబ్లిక్‌షో జరుగుచున్నా అతనికళ్ళు, అటుయిటు వెదకడం అనేది లేదు. కొన్నిసార్లు చాలా వేగంగా నడిచేవాడు. కాని అతని మిత్రులు కళ్ళు తిప్పుకోకుండా ఉండలేరు. వారు ఎక్కడ ఉన్నారోకూడా మరిచిపోతారు. అదే సావియోని అడిగితే షో గురించిన విషయమే తనకు తెలియదంటాడు. ఒక సందర్భంలో తాను ఏమీ గమనించని విషయాన్ని గురించి అడిగినప్పుడు తనతోటివారిలో ఒకడు ఇలా వెంటనే అన్నాడు. “కళ్ళుండి ప్రయోజనమేమిటి? చుట్టూ జరిగే వాటిని గమనించనపుడు” అన్నాడు. అందుకు దోమినిక్ యిలా అన్నాడు, “పనికిరాని వస్తువులపై నా కళ్ళు పెట్టేకంటే, పరమ పవిత్ర సౌందర్యరాశియైన మరియను, దేవుని దయను స్వర్గమునందు చూచుటకన్నా ఆనందం ఏముంటుంది?” అన్నాడు. నిష్కళంక మాతయందు అతనికి ఎంతో ప్రత్యేక భక్తిగలదు. దేవాలయమునకు వెళ్ళిన ప్రతిసారీ ఆ తల్లి పీఠమునొద్దకు వెళ్ళి తన హృదయాన్ని మాలిన్యము నుండి విడుదలచేయమని మోకరించి ప్రార్థించేవాడు. ఓ మరియా, నేను ఎప్పుడూ నీ కుమారుడిగా వుండాలి. అణకువ, వినయము లేకుండుట కంటే దానికి వ్యతిరేకముగా పాపము చేయుటకంటే నాకు మరణాన్ని ప్రసాదించు, అని వేడుకునేవాడు. ప్రతి శుక్రవారం తనమిత్రులను దేవాలయానికి తీసుకువెళ్ళి వారందరు కలిసి మరియతల్లి పొందిన ఏడు దుఃఖములను గూర్చి లేదా దేవమాత ప్రార్థన గూర్చి ప్రార్థించేవారు.

దోమినిక్ మరియమాత భక్తుడేకాదు. ఇతరులను కూడా మరియతల్లి పాదాల యొద్దకు తీసుకువచ్చి ఆమెను గౌరవించి ఆమె సహాయమును అడుగమనెడివాడు. ఒక చలికాలపు శనివారం తనతోటివానినొకనిని మరియతల్లిని సందర్శించి మరియ తల్లి స్తుతులను కలిసి వారిరువురు చెప్పారు. ఆ బాలుడు తన చేతులు చల్లగా ఉన్నట్లు చెప్పినపుడు తన గ్లౌవ్స్ తన మిత్రునకు యిచ్చాడు. మరొక సందర్భంలో ఇటువంటిదే తన తోటి బాలునికి తనకోటునిచ్చి తనతోపాటు గుడికి వచ్చి కలిసి ప్రార్థన చేయమన్నాడు. ఇటువంటి త్యాగ క్రియలను చూసినప్పుడు ఎవరు ప్రశంసింపక ఉండగలరు?


మే మాసపు రోజులలో మరియతల్లి యెడల అతని భక్తి తారాస్థాయికి చేరినది. తన సమూహముతో కలిసి మరియతల్లికి ప్రత్యేక గౌరవము చేయవలసినదిగా ఏర్పరిచాడు. మరియతల్లియొక్క అద్భుతకృత్యాలు, సందర్భాలు, ఎంతో ఆసక్తిగా చెప్పి, వినేవారిలో ఆ తల్లియెడల భక్తిభావాలు పెంపొందించాడు. తన మిత్రులతో విరామ సమయములో తరచుగా పాపసంకీర్తనము చేయవలసినదిగా, ప్రతినిత్యము సత్ప్రసాదము స్వీకరించవలసినదిగా భక్తి మర్యాదలు కనబరచమని చెప్పేవాడు. ఆసక్తికరమైన సన్నివేశమును మరియ తల్లి యెడల అతనికిగల భక్తిని పరిశీలిద్దాం.

పడకగదిలో బాలురందరు కలిసి మరియతల్లికి చిన్న పీఠము ఏర్పరచుదామని భావించారు. దానికిగాను, ప్రతిఒక్కరు తమకు తోచినది యివ్వాలని నిర్ణయించుకున్నారు. ఆసక్తిగల దోమినిక్ చెంత యివ్వడానికి యేమీలేదు. ఏమిచేయాలా అని ఆలోచించుచుండగా ఒక చక్కని ఆలోచన కలిగింది. తనకు బహుమతిగా యివ్వబడిన ఒక చక్కని గ్రంథమును లాటరీ పద్ధతిలో అమ్మి వచ్చిన దానిని యివ్వాలనుకున్నాడు. మిగిలినవారు అతని చేత ప్రోత్సహించబడి తమదగ్గరున్న చిన్న మొత్తాను సమకూర్చారు. చక్కని లాటరీ ఏర్పరచబడినది. దానివలన వచ్చిన మొత్తముతో కావలసిన అన్ని వస్తువులను సమకూర్చారు. బాలురందరు కష్టపడి ఒక పీఠమును సిద్ధము చేశారు. దానిని సమయానికి పూర్తి చేయడానికి కొందరు రాత్రంతా పనిచేయవలసి వచ్చింది. రాత్రంతా పనిచేయడానికి దోమినిక్ సిద్ధపడ్డాడు. అతడు అంతకు పూర్వమే వ్యాధికిగురైన కారణముగా బాలురు అతనిని విశ్రాంతి తీసుకోమని చెప్పారు. అతడు చాలా నిరాశపడ్డాడు. విధేయత అనే సుగుణము ఆచరించడానికి అంగీకరించాడు. అతనికి ఆ అవకాశాన్ని విడిచిపెట్టాలని లేదు. కాని విధేయత కారణముగా తప్పలేదు. ఎట్టి పరిస్థితిలోను, పూర్తియైన వెంటనే వచ్చి నన్ను మేల్కొల్పండి అని ఒకనితో అన్నాడు. 'పరమ పవిత్రురాలైన మరియ తల్లికి మనము నిర్మించిన పీఠాన్ని నేను మొదటిగా చూడాలి' అన్నాడు.

(ఇంకా వుంది)

# మనం మరిచిపోతున్న మన జాతిపిత!

(అక్టోబర్ 2 : గాంధీ జయంతి)





కొండవీటి అంతయ్య
సత్తెనపల్లి, 91 9247248681

శ్రీ మోహన్ దాస్ కరం చంద్ గాంధీజీ మన జాతి పిత. భరతమాత గర్భాన జన్మించిన మహోన్నత నేత. ఎన్నో జాతులు, ఎన్నో భాషలు, ఎన్నెన్నో మతాలు మరెన్నో సాంప్రదాయాలు గల భారత దేశంలో, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించి, భారతీయిలందరిని ఒక్క త్రాటిపై నడిపించిన జాతీయ నాయకుడాయన. అంతేకాదు, లోకమంతా ఒక్క ఇల్లై, ఒక్కరికోసం అందరూ, అందరికోసం ఒక్కరూ బ్రతకాలని మనసారా కాంక్షించిన మహా మనిషి గాంధీజీ! అందుకేనేమో "ఇలాంటి మనిషి ఒకరు ఈ భూమిపై జన్మించి జీవనం సాగించాడంటే, భావి తరాల వారు నమ్మక పోవచ్చు" అని మేటి శాస్త్రజ్ఞుడైన ఐన్స్టీన్ మహాశయుడు గాంధీజీ గురించి ఆనాడే అన్నాడట.

గాంధీజీ తన సిద్ధాంతాలను ప్రకటించి, తదనుగుణంగా జీవించిన నాటికీ, ఆయన్ని క్రమేపీ మనం మరిచిపోతున్న ఈ నాటికి, సమాజంలో ఏమైనా మార్పులు జరిగాయా? అంటే, నిజమే ! నాటికి నేటికి ఎన్నో మార్పులు వచ్చాయి. ముందుగా - 'స్వరాజ్య'మైతే వచ్చింది కానీ 'సురాజ్యం' ఇంకా రాలేదు. తెల్లదొరల పెత్తనం తెల్లారిపోయింది. కానీ నల్ల దొరల నాటకాలతో ప్రజాస్వామ్యం మసిబారి పోతున్నది. అర్ధ రాత్రివేళ ఆడది నిర్భయంగా తిరగ్గల స్వేచ్ఛ మన గడ్డపై ఇంకా ఆవిర్భవించ లేదు. ఆయన కలలుగన్న రామరాజ్యం రాలేదు సరికదా గ్రామసీమల్లో వ్యవసాయదారుల నడ్డి విరిగి పట్నం దారుల వెంట పరుగులు తీసే రోజులొచ్చాయి!

తరతరాలుగా వెలివేయబడి, సామాజికంగా అణచి వేతలకు గురైన దళిత వర్గాలపట్ల వివక్షతకు విరామ చిహ్నాలు అక్కడక్కడా వెలిసాయేమో గానీ ఫుల్ స్టాపులు ఇంకా పడ లేదు. రాజకీయ పార్టీలు పోసే ఆజ్యంతో కులాల కుంపట్ల చిచ్చులు ఆరకుండా రగులుతూనే ఉన్నాయి.

అందరికీ విద్య, వైద్యం ఇంకా అందని ద్రాక్షల్లాగే ఉన్నాయి. సుఖవంతంగా బ్రతకడానికి అవసరమైన 'కూడూ, గూడు, గుడ్డ' సరిగా దొరకని వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది.

ఒకవైపు శాస్త్రీయ పరిజ్ఞానం అపరిమితంగా పెరుగుతున్నా, మరోవైపు మానవనైజం ఆటవిక స్థితిలోకి అడుగులు వేస్తున్నది. మంచీ-చెడు, న్యాయం - అన్యాయం, నీతి-అవినీతి, పురోగమనం - తిరోగమనం అనే ద్వంద్వ స్వభావాలు కలగలిసి ఉండే మానవ సమాజంలో, మంచి ఏ కొంచెమైనా మిగిలి ఉండాలన్నా, సత్యం ధర్మం నీతి న్యాయాలు సమాజంలో నిలిచి ఉండాలన్నా, గాంధీజీ సిద్ధాంతాల ఆచరణ తప్పనిసరి!

అసలు ఏమిటీ ఈ సిద్ధాంతాలు ? అవే - సత్యం, అహింస, ధర్మ పాలన! యేసు ప్రభువు పర్వత ప్రసంగంలో ప్రవచించిన అష్ట భాగ్యాల గురించి నిరంతరం స్మరిస్తూ, అందరినీ నిరాడంబరంగా బ్రతకమంటాడాయన. నిజమే మాట్లాడమంటాడు. తనపని తాను చేసుకునే శ్రమైక జీవనం అలవరచుకోమంటాడు. శ్రమ దోపిడీ చేయరాదంటాడు. వ్యకిగత పరిశుభ్రత పాటించమంటాడు. సంఘ శ్రేయస్సును కాంక్షించమంటాడు. శత్రువునైనా సరే ప్రేమించమంటాడు. ఒక చెంపపై కొట్టిన వారికి మరొక చెంప చూపమని క్రీస్తు భగవానుడు భోధిస్తే, తెల్లవారిపై జరిపిన పోరాటంలో సత్యాగ్రహం ద్వారా అది అక్షరాలా ఆచరించి చూపిన ఆదర్శమూర్తి గాంధీజీ! ఆయన సిద్ధాంతాలను మనం ఆచరిస్తే, దారుణ మారణ కాండలు, దమన నీతులు, ఉగ్రవాదాలు, జాతి మత భేదాలు నామరూపాల్లేకుండా పోతాయి.

అమెరికా లాంటి అగ్రరాజ్యాల అణచివేతలకు, 'ఐసిస్' లాంటి హింసావాదుల విధ్వంస రచనలకు అతలాకుతలం అవుతున్న నేటి ప్రపంచం శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలంటే గాంధీజీ లాంటి నేతలు ఈ నేలపై ఉద్భవించాల్సిన అవసరం ఎంతో ఉంది !

ప్రతి మనిషి ఆత్మ గౌరవంతో బ్రతకాలన్నా, ప్రతి సంఘం సంఘటితంగా ముందుకు సాగాలన్నా, ప్రతి దేశం ప్రగతి పథంలో పయనించాలన్నా, గాంధీజీ సిద్ధాంతాలను అందరూ పాటించాలి. గాంధీజీ ప్రవచించిన శాంతియుత సహ జీవనాన్ని ఎవరు కోరుకోరు చెప్పండి ? అందుకే నాటికీ నేటికీ ఏనాటికైనా గాంధీజీ భావాలు ఆమోద యోగ్యాలు! అభిలషణీయాలు!! ఆచరణ పాత్రలు!!!

కానీ ఈనాడు మన జాతి పితకు మనం ఇస్తున్న గౌరవం ఏమిటి ? వీధి మూలల్లో చేశాం ఆయన విగ్రహాల ప్రతిష్టాపనం! నిస్సంకోచంగా చేస్తున్నాం ఆయన సిద్ధాంతాల ఖననం!! నేడు గాడ్సేలనే 'సేవియర్లు' అంటున్నాం. తరతరాల బూజులను పూజిస్తున్నాం! గాంధీని ఓ మహాత్ము డంటే నమ్మలేక పోతున్నాం! ఆయన తత్వాన్నే అపహాస్యం చేస్తున్నాం ! ప్రజలకోసం నిలబడిన వాడికన్నా వాడిని బలి తీసుకున్నవాడే మిన్న అంటున్నాం. సర్వజనుల సేవకన్నా స్వజన సేవ చేసేవాడే మిన్న అంటున్నాం. భిన్నత్వంలో ఏకత్వం సాధించే రాజకీయంకన్నా ఏకత్వంలో భిన్న తత్వాలను పెంచి పోషించే రాక్షసీయమే గొప్పగా భావిస్తున్నాం. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చినోడు గాంధీ అనేదానికన్నా దేశం విడిపోవడానికి కారణం గాంధీయే అంటుంటే ఇష్టంగా వింటున్నాం. చివరకు ఆయనను ఒక కులం వాడిగా ముద్ర వేసి, పండగ రోజున దండలు వేసే బొమ్మగా మార్చేసాం! దేశపు దాస్య శృంఖలాలను తిరుగు బాటుతో త్రుంచెయ్యాలని, ఆస్తులు అమ్మి పస్తులు ఉండి నిందుప్రాయపు సుఖాలు వదిలి, జైలు గోడల మధ్యన చేరి జాతిని నడిపిన నేతల త్యాగాలను మరిచిపోతున్నాం! తరతరాలకు తరగని సొమ్ము జాతిని దోచి దాచేయ్యాలని, మేతలు మేసే నేతలకు జైకొడుతున్నాం!' అందరమొకటే మనుషులమంతా కలిసి సాగుదాం జీవితమంతా' అనే వారిని ఛీ కోరుతున్నాం! కులం పేరుతో మతం పేరుతో, ప్రాంతం పేరుతో పార్టీ పేరుతో చీలిక తెచ్చి చిచ్చులు పెట్టె వారికేమో జై కొడుతున్నాం!

అందుకే మరి తన సేవలు తన భోధలు మరిచిపోవ తన జాతి విగ్రహాల రూపంలో మిగిలిపోయాడు మన జాతి పిత!! ◆

## బోస్కో మార్గం పాఠకులకు విజ్ఞప్తి


ఈ మాసపత్రిక నెల నెల క్రమముగా మీకు అందజేయాలని మా ప్రయత్నం. దయచేసి సహకరించండి. మీ యొక్క పోస్టల్ అడ్రస్ సరిగా ఉండే విధముగా వివరాలు మాకు అందించగలరు.

పూర్తిపేరు............... ఇంటి నెం........సెల్‌ఫోన్ నెం....... వీధి.......... మండలం......... జిల్లా........పిన్‌కోడ్.....

పత్రిక యొక్క ముద్రణ భారము పెరుగుటవలన చందాదారులు దయచేసి అర్థం చేసుకొని సంవత్సర చందా **110/- రూ.లు** లేదా రెండు సంవత్సరముల చందా **160/- రూ.లు.** లేదా జీవిత చందా **1000/- రూ.లు** వెంటనే ఈ క్రింది అడ్రస్‌కు చెల్లించి రశీదు పొందగలరు.

**డాన్‌బోస్కో టెక్నికల్ స్కూల్ ప్రెస్**
**చంద్రమౌళినగర్, రింగ్ రోడ్, గుంటూరు**

# క్రీస్తు స్థాపించిన సంఘము





రెవ. ఫాదర్ కస్పార్ చాట్ల
ఎడిటర్ అండ్ సెక్రటరీ
భారత మిత్రం సొసైటీ, సికింద్రాబాద్
సెల్ : +91 9573879171

**కొందరి సందేహము :** ప్రస్తుత నవీన కాలములో అనేక సంఘములు కనిపిస్తున్నాయి. ఏది నిజమైన సంఘమో, ఏ సంఘమునకు వెళ్ళాలో తెలియటంలేదు. ఇన్ని సంఘములు ఎందుకు వచ్చాయి? ఇన్ని సంఘములను చూసి హైందవులు హేళనగా మాట్లాడుతున్నారు. వీళ్ళల్లో వీరికే ఐక్యతలేదు అంటున్నారు. అసలు క్రీస్తు ప్రభువు స్థాపించిన సంఘం ఏది?

**సమాధానము : "నీవు పేతురువు. ఈ రాతిమీద నా సంఘమును నిర్మించెదను. నరక శక్తులు దీనిని జయింప జాలవు. నేను నీకు పరలోకరాజ్యపు తాళపుచెవులను ఇచ్చెదను" (మత్తయి 16:18-19).** ఇది ఆనాడు క్రీస్తు ప్రభువు పేతురుగారి నాయకత్వమున వాగ్దానము చేసిన సంఘము. ఈ సంఘమునే ప్రభువు పెంతుకోస్తు దినమున, తాను ఎన్నుకున్న అపోస్తులులందరిపై పవిత్రాత్మను పంపి, అపోస్తులుల సంఘమును స్థాపించారు. యేసు ప్రభువు స్థాపించిన ఈ అపోస్తులుల సంఘము గాక, మరొక నిజ సంఘము ఉండగలదా? ఆలోచించండి. ఇప్పుడు కనిపించే సంఘములు కాదు, ముందు కాలములో మరికొన్ని సంఘములు కనిపిస్తాయి. ఇది అంతమునకు సూచకము. ఏ సంఘమునైతే క్రీస్తు ప్రభువు స్థాపించారో, అదే నిజమైన సంఘము. ఆ సంఘము తప్ప, మరొక నిజమైన సంఘము ఈ భూమిమీదే ఉండజాలదు. ఈ రోజు ఉన్నా, అది చివరివరకు ఉండజాలదు. ఉన్నా నిలువ జాలదు. ప్రభువు వాగ్దానము : **ఒకే మంద ఒకే కాపరి ఉండాలి (యోహాను 10:16).** ఈనాడు మనకు లెక్కకందనన్ని సంఘములు ఉన్నాయి. ఒక్కొక్క సంఘమునకు ఒక క్రీస్తు అన్నట్టుగా, మీ క్రీస్తు, మా క్రీస్తు ఒకటికాదు అన్నట్టుగా బోధకులు సంఘములను తయారు చేస్తున్నారు. క్రీస్తుని విభజిస్తున్నారు. సువార్తతోటి వ్యాపారంచేస్తూ, స్వార్థముతో, అవసరములను గడుపుకొనుట కొరకు సంఘాలను ఎవరికివారు నియమించుకుంటున్నారు. ఇది చాలా దారుణమైన పాపము. పరిశుద్ధ గ్రంథమును పరిశీలించి, ధ్యానించుదాం.

**ధ్యానము :** మెస్సయ్య వస్తాడు, దేవుని ఆరాధించుటకు ఒక మందిరమును నిర్మిస్తాడు అనునది ఆనాడు దేవుడు దావీదు మహారాజుకు చేసిన వాగ్దానము. **"నీవు రోజులు నిండి నీ పితరులను కలుసుకొనిన పిమ్మట నీ మేనినుండి వెలువడిన తనయునే నా రాజ్యమునకు అధిపతిని చేసెదను. అతని యేలుబడిని ధ్రువపరచెదను. అతడు నాకు మందిరము నిర్మించును. నేను అతని సింహాసనమును కలకాలము స్థిరపరచెదను" (2 సమూయేలు 7:12-13).** ఇక్కడ తనయుడు అనగా సలోమోను రాజు కాదు. ఎందుకనగా అతని పరిపాలనను దేవుడు శాశ్వితముగా ధృవపరచలేదు. తనయుడనగా రానున్న క్రీస్తు. దావీదు వంశములోనుండి వస్తాడు కాబట్టి దావీదు తనయుడు అని పరిశుద్ధ గ్రంథము

తెలియజేస్తుంది. దావీదు వంశములోనుండి వచ్చే మెస్సయ్య జీవితంలో రెండు కర్తవ్యములు మనకు కనిపిస్తున్నాయి. 1. దావీదు వంశములో దావీదు తనయునిగా వచ్చే మెస్సయ్య రాజ్యమును దేవుడు శాశ్వితముగా స్థిరపరుస్తారు 2. దావీదు తనయుడుగా వచ్చే మెస్సయ్య దేవునికి ఒక మందిరమును నిర్మిస్తాడు. మందిరము అంటే రాళ్ళతో కట్టే దేవాలయము కాదు. తన రాజ్యమును శాశ్వతముగా ధృవపరచిన దేవుని, ఆత్మయందు, సత్యమందు ఆరాధించే పవిత్రాత్మ దైవ సంఘము. తన తండ్రిని ఆరాధించే దేవ సంఘమును నిర్మించటం క్రీస్తు ప్రభువుయొక్క కర్తవ్యము. ఈ దైవ సంఘమును నిర్మించటానికే యేసు ప్రభువు ఈ భూలోకమునకు వచ్చినప్పటి నుండి తపించారు. దైవ సంఘమును నిర్మించు పనిలో భాగముగానే 12 మంది అపోస్తులులను ఎన్నుకున్నారు. తన అపోస్తులుడైన పేతురుగారిని తన సంఘమునకు పెద్దగా నియమించారు. **"నీవు పేతురువు, ఈ రాతిమీద నా సంఘమును నిర్మించెదను. నరకశక్తులు దీనిని జయింపజాలవు" (మత్తయి 16:18-19).** ప్రభువు ఉత్థానమై, తండ్రి కుడిప్రక్కన కూర్చున్న తరువాత పెంతెకోస్తు దినమున పవిత్రాత్మతో ధృవీకరించినది ఈ అపోస్తులుల సంఘమునే. తండ్రి దేవుని వాగ్ధానముల ప్రకారము, యేసు ప్రభువు స్థాపించిన ఈ సంఘమునే ఏక కతోలిక అపోస్తులుల సంఘము అని, ప్రస్తుత రోజులలో ఆర్.సి.యం (రోమన్ కతోలిక మిషన్) సంఘము అని అంటున్నాము. ఈ ఏక అపోస్తులుల కతోలిక సంఘము అనునది పూర్వంనుండి ప్రవక్తలద్వారా దేవుడు రానున్న కాలములకు, తరములకు తనను ఆరాధించటానికి, దేవుడు ప్రవక్తలద్వారా వాగ్ధానము చేసినటువంటిది. ప్రభువు స్థాపించిన సంఘము తప్ప, మరొక నిజమైన దైవ సంఘము ఏముంటుంది?

ఈ సంఘమునకు అపోస్తులులను పెద్దలుగాను, ఆధార స్థంభములుగాను నియమించారు. **"ఆధార స్థంభములుగ ఎంచబడిన యాకోబు, పేతురు, యోహానులు దేవుడు నాకు ఒసగిన ప్రత్యేక కృపావరములను గుర్తించిరి. మేము అన్యులలోను వారు యూదులలోను పనిచేయవలెనని చెప్పి, తమతో బాగస్థులమనుటకు సూచకముగ వారు నాతోను, బర్నబాతోను కుడిచేతితో కరచాలనము చేసిరి" (గలతీ 2:9).** పౌలుగారు ఎఫెసీయుల సంఘమునకు చెప్పిన మాటలు ఒకసారి పరిశీలించండి **"కనుక, అన్యులారా! మీరు ఇక పరదేశులును, పరాయివారును కారు. మీరు ఇప్పుడు దైవ ప్రజలతో సహచరులు. దేవుని కుటుంబములో సభ్యులు. క్రీస్తు యేసు మూలరాయిగా అపోస్తులుల చేతను ప్రవక్తలచేతను వేయబడిన పునాదిపై మీరును నిర్మింపబడినవారే" (ఎఫెజీ 2:19-20).** ఇక్కడ రెండు విషయాలు స్పష్టమగుచున్నవి. సంఘమునకు మూలరాయి క్రీస్తు. పునాది అపోస్తులులై ఉండాలి. ఏ సంఘమైతే క్రీస్తు మూలరాయిగా, అపోస్తులులయొక్క పునాదిమీద నిర్మింపబడుతుందో, వారు దేవుని కుటుంబంలో సభ్యులు అవుతారు. అపోస్తులుల పునాది లేని ఏ సంఘమైనా పరదేశులతో సమానమే.

16వ శతాబ్దము వరకు ఉన్న ఒకే ఒక్క సంఘము ఏక అపోస్తులుల కతోలిక సంఘమే. కాని 16వ శతాబ్దములో గౌరవనీయులు రెవరెండ్ ఫాదర్ లూథర్ అనే కతోలిక గురువుకు, సంఘ పెద్దలతో వివాదములు తలెత్తినప్పుడు, కతోలిక సిద్ధాంతములను విభేధించి **(1 యోహాను 2:16)** అపోస్తులుల సంఘమును తృణీకరించి, బయటకు వెళ్ళి, తన పేరుతోనే సంఘమును స్థాపించారు. అదే లూథర్ సంఘము. ఆ ఒక్క చీలికనుండి పుట్టిన లెక్కకందని చీలికలే ఈనాడు మనకు కనిపిస్తున్న అనేక సంఘాలు. ఈనాటి సంఘములను చూస్తుంటే నిజముగా ఆశ్చర్యము వేస్తుంది. ప్రభువు ఒక్కడే, బైబులు గ్రంధం ఒక్కటే. అయినప్పటికీ విశ్వాసులలో ఏకత్వము లేదు, ఐక్యతలేదు. మాది గొప్పంటే, మాది గొప్పంటూ గొప్పవాడైన క్రీస్తును మరచిపోతున్నారు. భిన్న భావాలతో బైబులు గ్రంధమును బోధిస్తూ, విశ్వాసులను చెల్లాచెదరు చేస్తున్నారు.

అప్పటినుండి ఇప్పటివరకు చెక్కుచెదరని విశ్వాసముతో, ఏక విశ్వాసముతో ముందుకు నడుస్తున్న సంఘము ఏక పవిత్ర కతోలిక అపోస్తులుల (ఆర్.సి.యం) సంఘము మాత్రమే. **మలాకి గ్రంధము 3:1-4** లో చెప్పబడినట్లు, సూర్యోదయము నుండి సూర్యాస్తమయము వరకు యుగయుగములకు, తరతరములకు, లోకమంతట దేవాది దేవుని యోగ్యమైన సేవలు, ప్రీతికరమైన బలులు అర్పించ ఏర్పాటు చేయబడిన క్రీస్తు సంఘము కతోలిక శ్రీసభ సంఘము. **ఆఖరి దినమున ఉండునది ఒకే కాపరి, ఒకే మంద.** మొదట ఏ సంఘమునైతే, ప్రభువు స్థాపించారో, అదే చివరివరకు నిలుచును. అది పరి శుద్ధ గ్రంధములో ప్రభువు చేసిన వాగ్ధానము. ◆

# యువతరం శిరమెత్తితే... నవతరం గళమెత్తితే... లోకమే మారిపోదా... చీకటి తొలగిపోదా...




**కె. జోసెఫ్ అవినాష్**
పెదవడ్లపూడి గ్రామం, మంగళగిరి
7207773395




సమాజ భవిష్యత్తు నేడు యువత భుజస్కంధాలపై ఆధారపడి ఉందన్నది విశ్వ సత్యం. దేశ అభివృద్ధిలో నూతన ఆవిష్కరణలు కనుగొనడంలో యువత పాత్ర క్రియాశీలమైనది మరియు ముఖ్యమైనది అని ఎందరో కవులు, సంఘ సంస్కర్తలు అభివర్ణించారు. మన జీవిత ప్రయాణంలో యవ్వన దశ చాలా చాలా కీలకమైనది. దీనిని దాటుకొనే మనము ముఖ్యమైన దశకు చేరుకుంటాము. యవ్వన దశలో ఉన్నప్పుడు యువత శక్తిసామర్థ్యాలను ఇతర విషయాల కోసం వినియోగిస్తే వారి యొక్క భవిష్యత్తు కన్నీటిమయం అవుతుంది. యువత యవ్వనదశలో తీసుకునే మంచి ఆలోచనలు, మంచి నిర్ణయాలు భవిష్యత్తులో వారికి విజయాన్ని తీసుకువస్తాయి. భారతదేశంలో యువజనుల సంఖ్య దాదాపు 70 కోట్లు వున్నట్లు అంచనా. దేశ భవిష్యత్‌ను శాసించగల శక్తి వీరికి మాత్రమే వుంది. ఇప్పుడు మన యువతీ యువకులు ఎటువంటి వ్యక్తిత్వాన్ని, ఆలోచనలను, ఆధ్యాత్మిక జీవితాన్ని కలిగి జీవిస్తే విజయం సాధిస్తారో ధ్యానిద్దాం.

**యువతరంలోని శక్తి:** ఆధునిక ప్రపంచ చరిత్రలో యువత, విద్యార్థులు అనేక అద్భుతాలు సృష్టించారు. కొన్నిసార్లు వార్తాపత్రికల్లో, అదేవిధంగా టెలివిజన్లో ఎన్నో వార్తలు యువతీ యువకుల గురించి వింటూ ఉంటాము. వారు చేసిన సరికొత్త ఆవిష్కరణల గురించి, వారి సృజనాత్మకత గురించి వింటూ ఉంటాము. అనేకమంది యువకుల పాత సమాజాన్ని వెనక్కి తోసేసి కొత్త ఆలోచనలను, జీవన విధానాలను ముందుకు తీసుకొచ్చారు. ఎందరో యువతీ యువకులు చారిత్రక ప్రగతిలో యువత క్రియాశీల ప్రాతను పోషించాడు. సాహసం, కొత్త భావాలపట్ల అనురక్తి, క్రియాశీలత యువత సొంతం. అందువల్లే సమాజంలో కీలకమైన మార్పులు యువతరం తీసుకొని వస్తుంది. రాజకీయ, సామాజిక కార్యకలాపాల్లో యువత పాత్ర ఎంత పెరిగితే ఆ సమాజం అంత చైతన్యవంతంగా ముందుకు వెళుతుందనడానికి ఎన్నో ఉదాహరణలు ఇవ్వవచ్చును.

**మసకబారిపోతున్న యవ్వన ప్రాయం :** ప్రపంచవ్యాప్తంగా యువతను ప్రభావం చేసే పలు అంశాలను ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. వాటిలో అతివేగం, మద్యం మత్తు, ఆత్మహత్యలు, అంతర్జాలం, ర్యాగింగ్... ఈ ఐదు ప్రపంచవ్యాప్తంగా యువతను బలహీనపరుస్తున్నాయి. ఎందరో యువకులు యవ్వనదశలో చెడు వ్యసనాలకు బానిసలై తనువు చాలిస్తున్నారు; తల్లి దండ్రులను శోకసంద్రంలో విడిచిపెట్టి కన్ను మూస్తున్నారు; మంచి భవిష్యత్తును మంచి ఆరోగ్యాన్ని చెడు కోసం వినియోగిస్తూ చేతులారా నాశనం చేసుకుంటున్నారు. ఈతరం యువతపై ఇంటర్నెట్ ప్రభావం చాలా ఎక్కువగా ఉండి అనేక అసాంఘిక కార్యకలాపాలకు యువత ఇంటర్నెట్‌ను వినియోగించు కుంటోంది. యువతీ యువకులు ప్రశాంతంగా కూర్చుని ఆత్మపరిశీలన చేసుకుని చెడు వైపు వెళ్ళకుండా జాగ్రత్తపడాలి. ఏ అంశాలు వారిని బలహీనపరుస్తున్నాయో ఆలోచించి చెడు

వైపు వెళ్లకుండా ఆరోగ్యాన్ని సృజనాత్మకతను మంచి కోసం ఉ ప యోగిస్తే రానున్న తరం బాగుంటుంది, యువకుల్ని ఆదర్శంగా తీసుకుంటుంది.

**యువతీ యువకులు ఆధ్యాత్మిక జీవితాన్ని అభివృద్ధి చేసుకోవాలి. శ్రీ సభ కొరకు శ్రీ సభ అభివృద్ధి కొరకు తమ వంతు కృషి చేయాలి :** మనము ఎందరో పునీతుల జీవిత చరిత్రలను ధ్యానం చేస్తూ ఉంటాము. వీరి యవ్వనదశను మనం గమనించినట్లైతే, తల్లిదండ్రులను సైతం వీరు విడిచిపెట్టి దైవ సేవకు నడుం బిగించారు. కాలినడకతో ఎన్నో ప్రాంతాలను సందర్శిస్తూ ఎందరికో దైవవాక్కును అందించారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారు. కానీ నేటి యువతరం ఇతర విషయాల వైపు మొగ్గు చూపుతూ ఆధ్యాత్మికతకు దూరంగా ఉంటున్నారు. కనుక దేవుని గురించి సమగ్రంగా తెలుసుకొని శ్రీ సభలో అడుగిడితే ఎన్నో విశిష్టమైన మార్పులను యువతీ యువకులు చూడవచ్చును. ఈశక్తి యువతి యువకులకు ఉన్నది. మనతండ్రి గారైన రెండవ జాన్ పాల్ పోపు గారు ఈ విధంగా అంటూ ఉన్నారు:

"యువతే శ్రీ సభకు బలం. మన శ్రీసభ యువతకు కొత్త కొత్త కార్యక్రమాలను పరిచయం చేస్తూ, శిక్షణలు ఇస్తూ, యువతీ యువకులను ప్రోత్సహిస్తున్నది. యవనస్తుల సదస్సులు నిర్వహిస్తూ దేవుని గురించి తెలియజేస్తూ ఉన్నది."

అవును, యువతే శ్రీసభకు బలం. యువతీ, యువకులు తలుచుకుంటే శ్రీసభ కోసం ఎంతో చేయవచ్చు. కానీ అతి తక్కువ మంది మాత్రమే నేటికాలంలో ముందుకు వస్తున్నారు.

ఉదాహరణకు, దేవుడు ఎన్నుకొనిన ఇశ్రాయేలు ప్రజలు వారికి దేవుడు చేసిన మేలులను మర్చిపోయి వారికోసం ఎంతో మంది ప్రవక్తలను పంపించినప్పటికిని దేవుని ప్రేమను గ్రహించక విగ్రహారాధన వైపు దారి తీశారు. సృష్టి వస్తువులను పూజించడం మొదలు పెట్టారు. చివరికి చెల్లాచెదురై పోయారు. ఇటువంటి పరిస్థితుల్లో దేవుడు వారిని మరలా ఐక్యము చేసి ముందుకు నడిపించాలని భావించారు. ఈ తరుణంలో దేవుడు రాజునో లేక బలమైన సైనికుడినో ఇశ్రాయేలు ప్రజలను నడిపించటానికి ఎన్నుకోలేదు. దేవుడు ఒక యువకుడిని ఎన్నుకున్నారు. ఆ యువకుడి పేరు యిర్మియా. యిర్మియా దేవుడిచ్చిన బాధ్యతకు ఆశ్చర్యపడి ఈ విధముగా అంటూ ఉన్నారు "నేను, యావే ప్రభూ! నాకెట్లు మాటలాడవలెనో తెలియదు. నేను బాలుడును" అని పల్కితిని (యిర్మియా 1:6). "కాని, ప్రభువు నాతో ఇట్లు నుడివెను: "నీవు నేను బాలుడనని చెప్పవలదు. నేను పంపు వారందరి యొద్దకు నీవు వెళ్లవలెను. నేను చెప్పమనిన సంగతులెల్ల వారికి చెప్పవలెను. నేను నీకు తోడుగానుండి, నిన్ను కాపాడుచుందును" (యిర్మియా 1:7). యిర్మియా ఈ విధంగా సందేహించారు. "అయ్యా నేను యువకుడిని, నేను ఏ విధంగా నీ బాధ్యతను నెరవేర్చ గలను?" అందుకు దేవుడు, "నేనెప్పుడూ నీతోనే ఉండి నిన్ను ముందుకు నడిపించెదను. కాబట్టి నీవు ఈ పని చేయగలవు." జ్ఞానస్నానం పొంది శ్రీసభ సభ్యులుగా, దేవుని బిడ్డలుగా మారిన మనము, మన సంఘాన్ని అభివృద్ధి చేసుకోవాలి. శ్రీసభ ఎదుర్కొంటున్న విమర్శల నుండి శ్రీసభను కాపాడుకోవాలి. శ్రీసభ నిర్వహించే యూత్ రిట్రీట్స్ కు హాజరు కావాలి. గురువులు చెప్పే బోధనలను శ్రద్ధగా ఆలకించి వాటిని నలుగురితో పంచుకోవాలి. ప్రతి యువతీ, యువకుడు దేవుడు ఇచ్చిన జ్ఞానాన్ని బట్టి దేవాలయంలో కనీసం ప్రతినెల రెండవ శుక్రవారం లేదా అవకాశం ఉన్నప్పుడు ఒక అరగంట వాక్య పరిచర్య చేయాలి. యువకులు గాయక బృందంలో చేరి దైవార్చన గీతములను పాడుటకు మరియు విచారణలో జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనుటకు మరియు సహాయం చేయుటకు ముందుకు రావాలి. సండే స్కూల్ టీచర్స్ గా పిల్లలకు ఆధ్యాత్మిక విషయాలను నేర్పించాలి, శ్రీసభ సత్యోపదేశాన్ని చిన్నతనం నుండే వారికి నేర్పించాలి. కాబట్టి యువకులుగా ఉన్నప్పుడే దేవుని ప్రేమను తెలుసుకొని శ్రీసభకు మన వంతు సహాయం చేయాలి. అందరం కలిసి మన శ్రీసభను, మన విచారణను అభివృద్ధి చేసుకోవాలి.

**దేవాలయంలో యువత చురుకైన పాత్రను పోషించాలి :** ఈ మధ్య కాలంలో దేవాలయాలలో యువతీ యువకులు చాలా తక్కువగా కనిపిస్తున్నారు. చివరికి మనం అత్యంత పవిత్రంగా ఆచరించే విశ్రాంతి దినము అనగా ఆదివారం సైతం ఇదే వైఖరి కనిపిస్తున్నది. ఇది దేవునికి అయిష్టమైన కార్యము ఆదివారం పూజకు వస్తే మనం ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు నేర్చుకోవచ్చును అదేవిధంగా యువతీ, యువకులు సాధ్యమైనంత వరకు దేవాలయంలో జపమాల ప్రార్థనను, నిర్వహించడం దివ్యసత్ప్రసాద ఆరాధనకు సిద్ధపాటు చేస్తూ గురువుతో కలిసి వత్తాసు చేయటం, పీఠం అలంకరణ మొదలైన ఆధ్యాత్మిక కార్యకలాపాల్లో చురుకైన పాత్రను పోషించాలి. పూజా పఠనములును సైతం పూజలో చదవటం వలన మనలో ఆధ్యాత్మికత మెల్లమెల్లగా అభివృద్ధి చెందుతూ దేవుని

వైపు నడిచే విధంగా ఆకర్షిస్తుంది. సమయం దొరికినప్పుడల్లా విచారణ గురువులను కలుస్తూ ఆధ్యాత్మిక విషయాలను ఎక్కువగా తెలుసుకోవడం వలన సైతం హృదయ శుద్ధి కలుగుతుంది. దేవుని మార్గంలో నడిచే విధంగా గురువు యొక్క వ్యక్తిగత బోధనలు ఎంతగానో సహాయపడతాయి. ఇద్దరు ముగ్గురు యువకులు ఒకేచోట కలిసినప్పుడు ఈ లోక పరమైన విషయాలు కాకుండా ఆధ్యాత్మిక పరమైన విషయాలు మాట్లాడటంవలన వారిలో ఆధ్యాత్మికత ఎంతగానో పెరుగుతుంది. దేవుని వైపు మరింతగా అడుగులు వేస్తారు.

**తరుచూ పాప సంకీర్తనము చేయుట :** పాప సంకీర్తనము అను దేవద్రవ్యాను మానము శ్రీసభ మనకు ఇచ్చిన ఒక గొప్ప వరము. తప్పిపోయిన కుమారుడు ఏ విధంగా అయితే తన యొక్క తప్పుని తెలుసుకొని తండ్రిని చేరుకున్నాడో, అదేవిధంగా ఈలోక సంబంధమైన వ్యామోహాలకు తలవంచి దేవుడికి దూరంగా వెళ్లి పోతున్న సమయంలో ఈ పాపసంకీర్తన కార్యం అనునది దేవునికి దగ్గరగా చేస్తుంది. తరచూ పాప సంకీర్తన చేయటంవలన మనసులో ఉన్న చెడు ఆలోచనలు మొత్తం కూడా అంతరించిపోతాయి. దేవుని ఆత్మ యువకుల హృదిలో కుమ్మరించ బడుతుంది.

**అనుదినం బైబిలును చదువుట :** ఈ రోజులలో బైబిల్ గ్రంథాన్ని ఎవ్వరు సరిగా చదవడం లేదు. ఏదో నామ మాత్రంగా చదువుతున్నారు. ఉదయం లేచిన వెంటనే లేదా సమయం దొరికినప్పుడల్లా పరిశుద్ధ గ్రంథాన్ని చదవడం వలన దేవుని గురించి ఎన్నో విషయాలను తెలుసుకోవచ్చును. దేవునితో సహవాసం చేయవచ్చును. ఇలా పరిశుద్ధ గ్రంథాన్ని చదవటం వలన పాపపు వ్యామోహాలను, పాపపు జీవితాన్ని మరచి మనము పరిశుద్ధముగా జీవిస్తాము.

**స్వచ్ఛంద సంస్థలో సభ్యులుగా చేరి పరులకు సహాయం చేయుట:** మదర్ తెరిసా గారు తమ యొక్క యవ్వన ప్రాయంలో పరులకు సహాయాన్ని అందించి సహాయం కోరి వచ్చిన వారికి ఎన్నో సేవలు అందించారు. ఈనాడు మనం ధన్యజీవి మదర్ తెరిసా గారి పేరు మీద ఎన్నో స్వచ్ఛంద సంస్థలను చూస్తున్నాము. ఈ మధ్య కొందరు యువతీ, యువకులు వివిధ రకములైన స్వచ్ఛంద సంస్థలో సభ్యులుగా ఉంటూ అటువైపు ఆధ్యాత్మికతకు బద్ధులై మరోవైపు మానవ సేవే మాధవ సేవ అనే దృక్పథంతో మానవునికి సహాయం చేస్తే సాక్షాత్తు దేవునికి సహాయం చేసినట్టే అనే నినాదంతో తమ వంతు కృషి చేస్తూ ఎందరో పేదలకు సహాయం చేస్తున్నారు. అందరూ యువతీ యువకులు తమ యొక్క యవ్వన ప్రయాణాన్ని ఇటువంటి మంచి కార్యక్రమాలకు వినియోగిస్తే దేశ అభివృద్ధి చిరస్థాయిగా నిలిచిపోతుంది. ముఖ్యంగా ఒంటరిగా ఉన్న యువతీ యువకులు వారికి ఏం చేయాలో తెలియక చెడు ఆలోచనల వైపు వెళుతూ దేవుడిని నిర్లక్ష్యం చేస్తూ పాపపు బానిసత్వంలో జీవిస్తున్నారు. ఇటువంటి స్వచ్ఛంద సంస్థలో సభ్యులుగా చేరితే ఒంటరితనం పోతుంది. అదే విధంగా పాపపు జీవితం సమూలంగా తీసివేయ బడుతుంది.

**పిల్లల ఇష్టాలను తల్లిదండ్రులు అర్థం చేసుకొని వారికి ఏవైతే ఇష్టమో వాటిని ప్రోత్సహించాలి :** సాధారణంగా చాలా మంది తల్లిదండ్రులు తమ బిడ్డలు ప్రయోజకులు కావాలని, ఒక ఉన్నతమైన స్థానానికి వెళ్లాలని కోరుకుంటారు. ఇది మంచి విషయమే. కానీ వారికి ఏదైతే ఇష్టమో వాటిమీద తమ ధ్యాసను కేంద్రీకృతం చేయాలి. ఉదాహరణకు, కొందరికి ఇంజనీరింగ్ చేయాలని ఉంటుంది వారిని తీసుకెళ్లి తల్లిదండ్రులు డిగ్రీలో చేర్పిస్తే వారు దానిని చదవలేరు. పైగా ఒక రకమైన వేదనతో కూడిన వాతావరణంలోకి వాళ్ళు వెళ్ళిపోతారు. కాబట్టి తల్లిదండ్రులు పిల్లలకు ఏది ఇష్టమో అది న్యాయబద్ధమైనది అయితే దానిని ప్రోత్సహించాలి. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను వారికి ఇష్టమైన వాటిని నేర్పిస్తూ మానవతా విలువలను నేర్పిస్తూ, ప్రోత్సహించి ముందుకు నడిపించాలి. యువతీ యువకులు తలుచుకుంటే సాధ్యం కానిది ఏదీ లేదు. ప్రభుత్వ సంస్థలు కూడా యువతీ యువకుల కొరకు ప్రత్యేకమైన దృష్టి వహించాలి. వారి యొక్క ఎదుగుదల కోసం మంచి కార్యక్రమాలు చేస్తూ, వారి జ్ఞానాన్ని అభివృద్ధి చేస్తూ ఉండాలి. యువతీ యువకులు ఒక వైపు తమ యొక్క భవిష్యత్తును మంచి మార్గంలో నడిపిస్తూ మరోవైపు ఆధ్యాత్మికంగా బలపడితే భవిష్యత్తు చాలా బాగుంటుంది. పరిశుద్ధ గ్రంథంలో ఎంతో మంది యవ్వనంలో దేవుడిని తెలుసుకుని, దేవుని తరపున చెడుతో పోరాటం చేసి గెలిచారు. చిరస్థాయిగా ఆధ్యాత్మిక చరిత్రలో నిలిచిపోయారు. ఉదాహరణకి ప్రవక్తి దెబోరా, సంసోను, దావీదు మహారాజు మొదలైనవారు నలుగురికి ఆదర్శంగా నిలిచారు. అటువంటి గొప్ప సంకల్పాన్ని, శక్తిని దేవుడు యువతీ యువకుల కొరకు అనుగ్రహించాలని మనమంతా ప్రార్థన చేద్దాం. ◆






మల్లవరపు థామస్ చౌదరి
అనాజిపురం-సూర్యాపేట
ఫోన్: 9985267079

(జూన్ సంచిక తరువాయి)

**ప్రార్థించే భక్తులను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు :**

1. వచ్చిన ఆపదలకు దేవుని నిందిస్తూ ఆ ఆపదలను తొలగించమని ప్రార్థించేవారు మొదటి రకం. వారు సాధారణ భక్తులు.

2. వచ్చిన ఆపదలను ఎదుర్కొనే శక్తిని, ధైర్యాన్ని అనుగ్రహించమని ప్రార్థించేవారు రెండవ రకం. వారు మధ్యరకం భక్తులు.

3. కష్టమైనా, నష్టమైనా, ఆపదలు ఎన్ని వచ్చినా దైవచిత్తమే నెరవేరాలని ప్రార్థించేవారు మూడవ రకం. వారు అసలైన భక్తులు. నిజమైన భక్తులు.

శోధనలలో పడకుండుటకు ప్రార్థించమని శిష్యులను హెచ్చరించి వచ్చిన యేసుక్రీస్తు మళ్ళీ రెండవసారి మోకరిల్లి ప్రార్థించసాగాడు. అదే ప్రార్థన...

"తండ్రీ! నీకు అసాధ్యమైనదేదీ లేదు. సాధ్యమైతే ఈ పాత్రమును నానుండి తొలగింపుము. అయినను నా చిత్తము కాదు. నీ చిత్తమే నెరవేరనిమ్ము"

యేసుక్రీస్తు ప్రార్థనలో వినయముంది. విధేయతుంది. అభ్యర్థనుంది, ఆర్తివుంది, ఆవేదనుంది. అన్నిటిని మించి తండ్రి చిత్తమే నెరవేరాలనే తపన ఉంది. గాబ్రియేలు దూత మరియమాతకు మంగళవార్త చెప్పినప్పుడు ఆ తల్లి కూడా సరిగ్గా అలాగే స్పందించింది. "ఇదిగో నేను ప్రభువు దాసురాలను. నీ మాట చొప్పున నాకు జరుగునుగాక!" (లూకా. 1:38)

మానవ రక్షణార్థం మనుష్యకుమారుడు అనుభవించ వలసిన చిత్రహింసలు, వేదనలు, బాధలు, అవమానాలు, అవహేళనలు అన్నీ అతనికి కళ్ళ ముందు దృశ్యాలుగా కనిపిస్తున్నాయి. అతన్ని పగ్గాలతో బంధించి లాగింది, జుట్టుపట్టి ఈడ్చింది 24 సార్లు. గడ్డం వెంట్రుకలు పట్టి గుంజింది 23 సార్లు. తలపై మోదిన ముష్టిఘాతాల సంఖ్య 150. తలమీది గాయాలు 20. కడుపు మీద కొట్టిన దెబ్బల సంఖ్య 108. క్రింద పడద్రోసి భుజాలమీద, కాళ్ళతో తన్నింది 80 సార్లు. మొఖము మీద ఉమిసింది 180 సార్లు. శరీరం మీద మొత్తం దెబ్బల సంఖ్య 6,666. అతన్ని మొరటుగా నెట్టారు. జుట్టుపట్టి లేపారు. తలపై పెట్టిన ముళ్ళ కిరీటంలోని ముళ్ళ సంఖ్య 72. ముళ్ళ వలన అయిన గాయాలు 110. నుదుటి మీద ప్రాణాంతకమైన గాయాలు 3. అతని శరీరంపై మొత్తం గాయాల సంఖ్య 1000. అతడు చిందించిన రక్తపు చుక్కలు 28,430. అతన్ని అవమానించి హేళన చేసినవారి సంఖ్య 1008 మంది.

ప్రార్థిస్తున్న యేసుక్రీస్తు తలయెత్తి చూశాడు. దూరంగా క్షితిజరేఖ మీద భూమ్యాకాశాలని ఏకంచేస్తూ శాపగ్రస్తమైన మ్రాను ఒకటి భయంకరంగా ఊగుతోంది. భీతిగొలుపుతోంది. శృంగారతోటలో మధురిమలు కురిపించే ఫలవృక్షాలు ఎన్నో ఉండగా ఏవమ్మకి ఆ నిషిద్ధ ఫలవృక్షం మీదే మనసెందు కైందో.! దానికి అంత రుచి ఎందుకో...! అంచుల వరకు నింపిన చేదురస పాత్ర ఒకటి నురగలు క్రక్కుతోంది. పొంగి పొర్లుతోంది. మెలితిరిగిన సర్పమేమో పడగెత్తి బుసలు కొడుతోంది. కాటు వేయాలని చూస్తోంది. ప్రేషిత కార్యాన్ని అడ్డుకోవాలని చూస్తోంది. “ఆ పాపభారం మోయగలవా? ఆ శ్రమలపాత్రని త్రాగగలవా?” లూసిఫర్ సవాలు చేస్తున్నాడు. వికటాట్టహాసం చేస్తున్నాడు. పిల్ల సైతానులు ప్రభువు చుట్టూ చేరి వలయాకారంలో తిరుగుతున్నాయి. హేళన చేస్తున్నాయి. చికాకు పెడుతున్నాయి.

కోరి కఠోరమైన కష్టతరమైన శిలువ మార్గాన్ని ఎన్నుకొని ఆ రోజు కోసమే తపించి ఎంతో ఆరాటంగా ఆపేక్షగా ఎదురు చూసిన యేసుక్రీస్తు తీరా ఆ సమయం రానే వచ్చినప్పుడు ఎందుకు ఇంతగా వేదన పడుతున్నాడు? సజీవ దేవుని కుమారుడు, అభిషిక్తుడు ఇతడేనా? పన్నెండేళ్ళ ప్రాయంలోనే దేవాలయంలో వేదశాస్త్రులతో, పండితులతో తడబడకుండా నిర్భయంగా వాదించింది ఇతడేనా? నజరేత్తులోని సొంత ప్రజలే అతన్ని చంప ప్రయత్నించినప్పుడు కూడా వెరువనివాడు ఇతడేనా? పిశాచాలని పారద్రోలిన వాడు, సముద్రాన్ని గద్దించిన వాడు ఇతడు కాదా? ప్రధానాచార్యుల, పరిసయ్యుల, వేదశాస్త్రుల కుట్రలు కుయుక్తులకు చలించని యేసుక్రీస్తు ఎందుకు... ఎందుకు ఇప్పుడు ఇలా ఇంతగా ఆవేదన పడుతున్నాడు? చోద్యాలలో కెల్లా చోద్యమైన ఈ విచిత్ర పరిస్థితి ఏమిటి? అసలు ఇలాంటి పరిస్థితిని ఆయన ఎందుకు అనుమతించాడు?

అవును ఇలాంటి పరిస్థితిని ఆయనే స్వయంగా అనుమతించాడు. నరజాతిపై అతనికి గల అనంతమైన ప్రేమకి, అపారమైన కృపకి అదే నిదర్శనం. శ్రమలపాత్రలో నుంచి ఆయన తాగనిదేదీ మనకు ఇవ్వలేదు. అది ఆయనే స్వయంగా సంకల్పించుకున్నాడు. ఎందువలననగా పునీత పౌలు చెప్పినట్లుగా ప్రజల పాపముల పరిహారార్థము భగవత్సేవలో విశ్వసనీయుడును దయామయుడును అగు ప్రధాన యాజకుడు అగుటకుగాను, ఆయన సర్వవిధములను మనలను పోలినవాడు కావలసివచ్చెను. తానును శోధింపబడి వ్యథనొందెను. కనుక ఇప్పుడు ఆయన శోధింపబడువారికి సాయపడగలడు (హెబ్రీ. 2:17-18).

యేసుక్రీస్తు లేచి శిష్యుల వద్దకు వెళ్ళాడు. 12 మంది అపోస్తులలో ఆ ముగ్గురు ప్రభువుకి ఆత్మీయ అపోస్తులులు. అంతఃరంగిక శిష్యులు. 12 మంది అపోస్తులులని తండ్రిదేవుడే ఎంపిక చేసుకున్నప్పటికి ఈ ముగ్గురిని మాత్రం యేసుక్రీస్తు ప్రత్యేకంగా అభిమానించాడు, ఆదరించాడు. ప్రభువు దివ్యరూపాన్ని దాల్చినపుడు, యాయీరు కుమార్తెను జీవంతో లేపినపుడు ఆ ముగ్గురు అతని వెంటే ఉన్నారు. ఇప్పుడు ఈ చివరి ఘడియల్లో కూడా తనతో మెలకువగా ఉండుటకు, ప్రార్థించుటకు బోధకుడే వారిని ప్రత్యేకంగా పిలుచుకున్నాడు. ఆపద సమయంలో మెలకువతో వుండి ప్రార్థించవలసిన శిష్యులు దుఃఖభారంతో అలసిపోయారు, సొలసిపోయారు. నిద్రపోయారు. బోధకుని అడుగుల చప్పుడు విని త్రుళ్ళిపడి లేచారు. దుఃఖంతో కుమిలిపోయిన బోధకుని చూశారు. అతని ముఖం వేదననతో నల్లబడి పోయింది. అలాంటి ప్రభువును చూడగానే శిష్యులకు దుఃఖం వచ్చింది. మాట పెకల్లేదు. ఆరు నెలల క్రితం తాబోరు పర్వతం మీద వేయికోట్ల సూర్యతేజంతో పరంజ్యోతిలా ప్రకాశిస్తున్న యేసు దివ్యరూపాన్ని చూసి పరమానందంతో “ప్రభూ! మనము ఇక్కడ ఉండుట మంచిది” అని తన్మయత్వంతో పలికిన ఇదే శిష్యులు ఇప్పుడు మౌన ముద్రాంకితులయ్యారు. బోధకునికి ఏమి చెప్పాలో వారికి తోచలేదు. ఎంతలో ఎంత తేడా! ఒళ్ళుమరిచి నిద్రించినందుకు తమనితామే తిట్టుకున్నారు. శిష్యుల స్థితిని బోధకుడు అర్థం చేసుకున్నాడు. వారితో “మీరు శోధనలకు గురికాకుండుటకు మేలుకొని ప్రార్థింపుడు'' అని మరొకసారి సున్నితంగా హెచ్చరించి బరువెక్కిన గుండెతో భారంగా బాధగా వెనుదిరిగాడు. శిష్యులు ప్రార్థించుటకు మోకరిల్లారు. కాని ఎంతో సేపు ప్రార్థించలేకపోయారు. నిద్రాభారంచే వారి కనురెప్పలు బరువెక్కాయి. వాలిపోయాయి. బోధకుడు తన ప్రార్థనా స్థలానికి యింకా చేరుకున్నాడో లేదో ప్రార్థిస్తున్న శిష్యులు మోకరించిన వారు మోకరించినట్లే కూలబడిపోయారు. ఒకరి పై ఒకరు ఒరిగిపోయారు. నిద్రపోయారు. వారి ఆత్మలు ఆసక్తి కలిగివున్నను దేహములు బలహీనమైనవి.

రక్షకుడు

అది క్రూరమైన కాళరాత్రి.

భయంకరమైన పీడరాత్రి.

యేసుక్రీస్తు మళ్ళీ మూడవసారి మోకరిల్లాడు. దోసిలొగ్గాడు. ప్రార్థిస్తున్నాడు. నీరసంగా ఉన్నాడు. నిస్సత్తువగా ఉన్నాడు. అతని శరీరం విల్లంభులా వంగి సన్నగా వణుకుతోంది. ముందుకూ వెనకకూ ఊగుతున్నాడు. తూగుతున్నాడు. తూలుతున్నాడు. శిరస్సుని శిలపై మోపాడు. ఎర్రని చిక్కని రక్తం బొట్లుబొట్లుగా రాలుతోంది. శిలని తడిపేస్తోంది. మరికొన్ని రక్తపు చుక్కలు గడ్డంలోనే చిక్కుకున్నాయి. మనుష్యకుమారుడు మరింత దీక్షగా ప్రార్థించసాగాడు. చేసిన ప్రార్థనే మళ్ళీమళ్ళీ చేస్తున్నాడు. ఒక్క చిన్నమార్పు. ఇప్పటి వరకు "సాధ్యమైన యెడల..." అంటూ ప్రార్థించిన యేసుక్రీస్తు ఇప్పుడు "సాధ్యముకాని యెడల..." అంటూ ప్రార్థిస్తున్నాడు.

"ఓ తండ్రీ! నేను పానము చేసిననే తప్ప ఈ పాత్రము నానుండి తొలగిపోవ సాధ్యముకాని యెడల నీ చిత్తము నెరవేరనిమ్ము" యేసుక్రీస్తు తండ్రిని ప్రాధేయపడుతున్నాడు. ప్రార్థిస్తున్నాడు. అర్థిస్తున్నాడు. బ్రతిమాలుతున్నాడు. బామాలుతున్నాడు.

యేసుక్రీస్తు ఏ పాత్రని ఆయన వద్దనుంచి తొలగించమని ప్రార్థిస్తున్నాడు? శ్రమల పాత్రనా? మరణ పాత్రనా? యేసుకీస్తు శ్రమలకి, మరణానికి భయపడుతున్నాడా? సత్య శ్రీసభ చరిత్రలో ఆనాటి స్తెఫాను (క్రీ.శ.34) మొదలుకొని నిన్నమొన్నటి (21/04/2019) ఈస్టర్ ఆదివారం శ్రీలంకలోని కథోలిక చర్చిల మీద జరిగిన మతోన్మాదుల బాంబు దాడుల వరకు ఎందరో క్రైస్తవులు క్రీస్తుకోసం క్రీస్తు ప్రకటించిన రక్షణ సువార్తకోసం శ్రమలనుభవించారు. చిరునవ్వుతో ప్రాణాలర్పించారు. హతులయ్యారు. హతసాక్షులయ్యారు. వారంతా జీవించినా క్రీస్తు కోసమే జీవించారు. మరణించినా క్రీస్తు కోసమే మరణించారు. అలాంటిది వారందరికి స్ఫూర్తినిచ్చిన యేసుక్రీస్తు మరణానికి భయపడతాడా? అలా అనటం అతన్ని అవమానించటం తప్ప మరేమీకాదు.

మరి యేసుక్రీస్తు ఎందు కోసం ఇంతగా తండ్రిని ప్రాధేయపడుతున్నాడు? అర్థిస్తున్నాడు? ప్రార్థిస్తున్నాడు? ఈ చివరి క్షణాలలో యేసుక్రీస్తు తన మనస్సేమైనా మార్చుకున్నాడా? సిలువ బలియాగానికి ప్రత్యామ్నాయంగా మరింకేమైనా చూడమంటున్నాడా? మానవ రక్షణకార్యం ప్రమాదంలో పడబోతోందా?

లేదు లేదు. మానవ రక్షణ కార్యానికి వచ్చిన ప్రమాదం ఏమీలేదు. యేసుక్రీస్తు మనస్సేమీ మార్చుకోలేదు. మనసు మార్చుకునే ప్రమాదంలో ఉన్నది యేసుక్రీస్తు కాదు. అతడు ఎల్లప్పుడు తండ్రి చిత్తమే నెరవేర్చాడు. తండ్రి చిత్తం పాటించటమే ఆయనకు పరమానందం (కీర్తన. 40:8). ఆయన ఎప్పుడును తండ్రికి ప్రీతికరమగు పనులనే చేశాడు (యోహాను. 8:29). ఇప్పుడు కూడా తండ్రి చిత్తం నెరవేరాలని మాత్రమే ప్రార్థిస్తున్నాడు. తండ్రి చిత్తమేమిటో తెలుసుకోటానికే ప్రయత్నిస్తున్నాడు. ప్రయాస పడుతున్నాడు. తండ్రి చిత్తాన్ని నెరవేర్చటంలో కుమారుని చిత్తశుద్ధిని శంకించటానికి, ప్రశ్నించటానికి ఏమీ లేదు. ప్రశ్నించాల్సింది ఏమైనా ఉంటే అది తండ్రి దేవుని చిత్తాన్ని గురించి మాత్రమే! అబ్రహాము తన కుమారుడు ఇస్సాకుని బలి ఇస్తున్నప్పుడు అందుకు ప్రత్యామ్నాయంగా గొర్రెపిల్లని చూపించిన యావే దేవుడు ఇప్పుడు తన కుమారుని సిలువ బలి యాగానికి మరేమైనా ప్రత్యామ్నాయాన్ని ఆలోచిస్తున్నాడా?

సర్వ మానవ పాపపరిహారార్థం రక్తప్రోక్షణం అవస్యం. అది అనివార్యం. మరో మార్గమే లేదు. అందుకు మన ప్రభువు సిద్ధంగానే ఉన్నాడు. అయితే అది లేఖనాల ప్రకారమే జరగాలి. అతనియందు నెరవేరవలసిన లేఖనాలు కొన్ని ఇంకా మిగిలే ఉన్నాయి. యేసుక్రీస్తు గెత్సెమనితోటలో యింకా అడుగు కూడా పెట్టకముందే శిష్యులతో ఒక మాటన్నాడు "అతడు అపరాధులలో ఒకడుగా పరిగణింపబడెను అను లేఖనము నాయందు నెరవేరవలసి యున్నది. నన్నుగూర్చి వ్రాయబడినవి అన్నియు నెరవేరనున్నవని మీతో చెప్పుచున్నాను" (లూకా. 22:37).

(ఇంకా వుంది)



# సహాయమాత ద్వారా జరిగిన అద్భుతాలకు సాక్ష్యాలు

## ఆపరేషన్ విజయవంతం

**నాపేరు జి. సామ్రాజ్యం.** మాది కొరిటెపాడు, గుంటూరు. ముందుగా దేవాధి దేవునికి క్రీస్తువుల సహాయమాతకు వందనాలు తెలుపుతున్నాను. నా తల్లిగారైన రామ తులశమ్మ ఛాతిలో గడ్డ వచ్చినది. పరీక్షలు చేయగా క్యాన్సర్ అని తెలిపినారు. వెంటనే ఆపరేషన్ చేయవలయునని చెప్పినారు. మా అమ్మగారికి ఆఫరేషన్ బాగా జరిగి త్వరగా కోలుకోవాలని ఆ సహాయమాతను వేడుకున్నాను. మా అమ్మగారికి ఆపరేషన్ బాగా జరిగినది, వ్యాధి త్వరలో నయమై పూర్తిగా కోలుకున్నారు. మాకింత సహాయంచేసిన యేసయ్యకు, మరియతల్లికి వందనాలు.

## ప్రమోషన్ వచ్చింది

**నాపేరు విజకుమారి.** మాది గోరంట్ల. మా పాప బ్యాంక్‌లో ఆడిటింగ్ మేనేజరుగా పనిచేస్తూ వేరే బ్యాంక్‌కు పరీక్ష వ్రాయగా ఆ బ్యాంక్‌లో సీనియర్ మేనేజర్ పోస్టు వచ్చినది. ఈ పోస్టుకు వెళ్ళుటకు రిలీవ్ చేయకుండా చాలా ఇబ్బంది పెట్టినారు. కారణం, ఆడిటింగ్‌లో ఉండగా ఒకతను 4 లక్షలు మోసం చేస్తే పట్టుకుంది. నీవు నా ఆడిటింగ్ కాగితముపై సంతకం చేస్తే నిన్ను రిలీవ్ చేస్తాను అని పట్టుపట్టాడు. మోసానికి నేను తలవంచను అని మా అమ్మాయి 21వ తారీఖున కడపకు బయలుదేరాలి. 20వ తేదీ సాయంత్రం 5.50 ని.లకు కూడ రిలీవ్ చేయలేదు. ఆ అధికారులను, నేను నియమించినవారే అన్నావుగా తల్లి, ఆ అధికారులలో మార్పుతెచ్చి స్ఫూర్తికి రిలీవింగ్ ఇప్పించమ్మా అని ఏడ్చి ప్రార్థించినాను. 6.00 గంటలకల్లా అమ్మాయిని రిలీవ్ చేసారు. ఆ తల్లికి వేలాది వందనాలు.

## వాంతుల నుండి స్వస్థత

**నాపేరు నిర్మల రాణి.** మాది అరండల్‌పేట గుంటూరు. నేను సి.బి.ఎస్.ఇ. పరీక్షలు 3, 5 తేదీలలో వ్రాయబోతున్నాను. పరీక్షలకు ముందురోజు వాంతులు, విరేచనాలు వచ్చినవి. చదువు కోవటానికి కూడ ఓపిక లేకపోవటంతో చాలా బాధ పడినాను. నేను క్రైస్తవుల సహాయమాతను అర్థించి పరీక్షలకు వెళ్ళినాను. పరీక్ష బాగా వ్రాసినాను. అద్భుతము ఏమిటంటే 64% తో పాసైనాను. దేవునికి, క్రీస్తువుల సహాయమాతకు వందనములు.

## ఆపరేషన్ లేకుండా స్వస్థత

**నాపేరు చిన్నాబత్తిని వెళాంగణి రాణి.** మాకు ఇద్దరు కుమార్తెలు, మా చిన్నపాపకు కడుపులో నొప్పి వస్తుందని హాస్పిటల్‌లో చూపించాము. డాక్టర్ కిడ్నీలో రాళ్ళు ఏర్పడినాయి, ఆపరేషన్ చేయాలని అన్నారు. మరో రెండు హాస్పిటల్‌లో చూపించాము. వాళ్ళుకూడా ఆపరేషన్ చేయాలన్నారు. చివరిగా నిత్య సహాయమాతను తలంచుకొని ఆపరేషన్ అవసరం లేకుండా తగ్గే విధంగా మాకోసం ప్రార్థించమని వేడుకొని వేరే హాస్పిటల్‌కి వెళ్ళాము. ఆ డాక్టర్‌గారు ఆపరేషన్ అవసరంలేదు. నెలరోజులు మందుల ద్వారా తగ్గుతుందనిచెప్పారు. క్రీస్తువుల సహాయమాత మరియతల్లి ప్రార్థన ద్వారా మా బిడ్డకు నెలరోజులలో మందుల ద్వారా స్వస్థత పొందినది. నిత్య సహాయమాతకు కృతజ్ఞతా స్తుతులు చెల్లిస్తున్నాను. "స్వస్థతనిచ్చిన దేవా వందనం, సర్వవేళలా ఘనతా, మహిమ నా యేసునకు కలుగునుగాక!"

**మీ ప్రార్థనా అవసరతలు మాకు తెలియపరచండి**
**సహాయమాత ప్రార్థనా బృందం మీ నిమిత్తం ప్రార్థించెదరు.**

శ్రీ బాలశౌరయ్య పి.ల్. : 9700627134
శౌరిరాజు డి. : 9492464360
అంతోని స్వామి జి. : 9160006062
శ్రీమతి ఇన్యాశమ్మ బి. : 8143336190
శ్రీమతి సుశీల కె. : 9492709685
శ్రీమతి పి. లిల్లీమేరి : 9440170835
sahayamathachurchgnt@gmail.com

మా చిరునామా :

**సహాయమాత పుణ్యక్షేత్రం ప్రార్థనా బృందం**
డాన్‌బోస్కో టెక్నికల్ స్కూల్, చంద్రమౌళినగర్,
రింగ్‌రోడ్, గుంటూరు - 522 007




సేకరణ : సిహెచ్. మర్రెడ్డి, 9912132037, గుంటూరు

1. ఐదవ దేవదూత తన బాకాను ఊదగా ఏమి జరిగింది? దానికి ఏమి ఒసగబడెను?
2. అగాధము నుండి పొగవెడలి దానిగుండా మిడతలు వచ్చి ఏమి చేశాయి?
3. ఆ మిడుతలు దేనిని పోలిఉన్నవి?
4. ఆరవ దేవదూతతో ఆ స్వరము ఏమని చెప్పెను?
5. మూడు అనర్ధముల వలన ఏమి సంభవించినది?
6. మిగిలిన మానవులు ఎలాంటి ప్రవర్తన కలిగి వుండిరి?
7. బలవంతుడైన దేవదూత ఏమి ధరించెను?
8. అతని పాదములు దేనిపైన నిలిచివున్నవి?
9. ఆ దేవదూత చేతినెత్తి ఏమని పలికెను?
10. ఎ) దేవదూత నుండి తీసుకొనిన గ్రంథమును తినినప్పుడు అది ఎలా ఉండెను?

    బి) పాత నిబంధన గ్రంథములోని 24వ పుస్తకము ఏది? అందు ఎన్ని అధ్యాయములు ఉన్నవి?

### సెప్టెంబర్ నెల బైబిల్ క్విజ్ విజేతలు

కె. సంపంగిరావు గుంటూరు, డి.ఎస్.వి. విజయకుమారి గిద్దలూరు, డి. ఉదయతార కేసరపల్లి. పూదోట లక్ష్మీ సరోజిని, డి. ప్రకాశమ్మ, మల్లవరపు అమలీన్‌రాజు బి. తోమాసమ్మ గుంటూరు; ఎం. లక్ష్మయ్య ప్రొద్దుటూరు, డి. దేవకరుణానిధి గిద్దలూరు. డి. సుశీల, డి. సునీత జగ్గయ్యపేట.

**క్విజ్ మాస్టర్**
**బోస్కో మార్గం**
**డాన్‌బోస్కో టెక్నికల్ స్కూల్ ప్రెస్**
రింగ్‌రోడ్, గుంటూరు - 522 007
**E-mail :** dbprintmedia@gmail.com
Phone : 0863 - 2350832

## జోరున కురుస్తున్న వర్షాలతో అల్లాడుతున్న రైతు

గత నెల రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలకు రోడ్లు అన్నీ జలమయం అయ్యాయి. పంట పొలాలు మునిగిపోయాయి. ఎక్కడ చూసినా నీటి మయం దీనికితోడు తుఫాను ప్రభావంతో జనం అల్లాడుతున్నారు. సిటీలలో వున్న రోడ్లన్నీ గుంటలమయం. పంటలలో కలుపు మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ వర్షాలతో ముఖ్యంగా ప్రతి, మిర్చి, వరి పంటలు విపరీతంగా నష్టపోతున్నాయి. పట్టించుకునే నాధుడే లేదు.

## రాష్ట్రంలో ఇసుక కష్టాలు

రాష్ట్రంలో వరదలు, వర్షాల ప్రభావంతో ఇసుకకు తీవ్ర ఇబ్బందులెదురైనాయి. అదీగాక ఇసుక రేటు విపరీతంగా పెరిగిపోవడంతో బిల్డర్లు, తాపీ పనివారు, గృహ నిర్మాణం పనిలేక నానా అవస్థలు పడుతున్నారు.

## ఉల్లి కోసం వరుసలు

రాష్ట్రంలో ఉల్లి ధర 50 రూ.ల దాటడంతో వినియోగ దారులకు వాటిని కోకుండానే కన్నీరు వచ్చేంత పని అవుతోంది. ప్రభుత్వం స్పందించి ఉల్లిపాయలు కిటో రూ. 25కే గురువారం నుండి రైతుబజార్లలో అందిస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో కొనుగోలుదారులు విజయవాడలోని స్వరాజ్య మైదానం రైతు బజారులో బారులు తీరారు. సుమారు 3 గం.ల పాటు నిరీక్షించారు. మరోవైపు గుంటూరులో రైతుబజారులో రాయితీ ఉల్లిపాయల కేంద్రాన్ని మార్కెంట్ కమీషనర్ ప్రారంభించారు.

## మరోసారి జాబిల్లి యాత్ర కోసం కసరత్తు

భవిష్యత్‌లో మరోసారి చంద్రుడి వద్దకు వ్యోమనౌకను పంపేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు భారత అంతరిక్ష సంస్థ ఇస్రో చైర్మన్ కె. శివన్ పేర్కొన్నారు. విక్రమ్ లాండర్ విఫలం కావడానికి కారణాలను కనుగొనేందుకు ఏర్పడ్డ జాతీయ స్థాయి కమిటీ నుండి నివేదిక వచ్చాక భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. రానున్న రోజుల్లో అనేక ప్రయోగాలు చేపట్టనున్నట్లు చెప్పారు.




## "ఒక కుటుంబంలో ఒకరు గురువుగా వుండుట ఓ మహోన్నతమైన దైవ వరం"

రండి! డాన్‌బోస్కో గారి సభలో సభ్యులుగా చేరండి !!

"ప్రభువు మిమ్మల్ని పిలుస్తున్నారా ? ప్రియ యువకులారా ! మీ ప్రతిభలను వెలికితీయండి, దేవుడు మీకొసగిన వరములను ఇతరులతో పంచుకోండి. సువార్తికులుగా ఎదగండి. మీ గొప్ప కలలను సాకారం చేసుకోండి." -పోప్ ఫ్రాన్సిస్

ప్రపంచములోని దాదాపు 134 దేశాలలో, సువార్త పరిచర్యకు, యువకుల సేవకై అంకితం అయిన డాన్‌బోస్కో సభలో చేరండి.

పదవ తరగతి మరియు ఆ పైన చదివిన కథోలిక బాలురకు, యువకులకు ఇదే మా ఆహ్వానం ...

**సంప్రదించవలసిన చిరునామాలు**

వొకేషన్ ప్రమోటర్, రెవ. ఫా. శరత్, యస్.డి.బి.,
డాన్‌బోస్కో ప్రావిన్షియల్ హౌస్, డాన్‌బోస్కో నగర్ (పోస్ట్) బండ్లగూడ జాగీర్
హిమాయత్‌సాగర్ రోడ్, హైదరాబాద్ - 86, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ
ఫోన్ : 630 570 4889, 8978423606
Email: inhvocationpromoter@gmail.com

రెవ. ఫా. గార్లపాటి కిషోర్, యస్.డి.బి.,
రెక్టర్, డాన్‌బోస్కో నిలయం, కార్మెల్ నగర్, గుణదల, విజయవాడ
ఫోన్ : 0866 - 2450386
9440869468




## PRAVAHINI

**Don Bosco Communications,** BIRDY, Don Bosco Nagar Post, Bandlaguda Jagir,
Hyderabad - 500 086, T.S., India, Mobile : 9949579486

# బైబిల్ డైరి 2020

## దైవ వాక్యార్చన ధ్యానమాలిక

హైద్రాబాద్‌నందు గల "డాన్‌బోస్కో పబ్లిషింగ్ హౌస్" రాబోవు 2020 వ సంవత్సరములో ఆకర్షణీయమైన హంగులతో, దైవీక అంశాలతో బైబిల్ డైరిని మీ ముందుకు తెస్తుంది. వేలాదిమంది తెలుగు క్రైస్తవుల విశ్వాస జీవన యాత్రలో **"దైవ వాక్యార్చన ధ్యాన మాలిక"** అయిన ఈ బైబిల్ డైరి అనుదినము ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాము.




### బైబిల్ డైరి ప్రత్యేకతలు :

- ప్రముఖ బైబిల్ పండితులు రచించిన ధ్యానములు
- సృజనాత్మకతతో కూడిన ఆకర్షణీయమైన ముద్రణ
- అనుదిన పఠనాలు, భక్తి కీర్తనలు, ఆదివార సువిశేష పఠనాలు
- పునీతుల సంక్షిప్త జీవిత గాథలు
- స్మరణలు, పండుగలు, మహోత్సవములు
- ప్రతిదిన పూజ వస్త్రముల రంగులు
- తిరుసభ పితామహులు, పునీతులు మరియు వీరుల సుభాషితాలు.

**వెల : రూ. 115/- లు మాత్రమే**


కాపీల కొరకు సంప్రదించవలసిన చిరునామా :

**డాన్‌బోస్కో పబ్లిషింగ్ హౌస్**

6-49, బర్డి, డాన్‌బోస్కో నగర్ పోస్ట్

బండ్లగూడ జాగీర్, హైద్రాబాద్, రంగారెడ్డి జిల్లా,

తెలంగాణ - 500 086

+91 9492415255, +91 9390257614

donboscopublishinghouse@gmail.com